విశాఖపట్టణం
మంగళవారం 13 అక్టోబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 242 వెల: రూ.5/- పేజీలు: 12

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దు

అధికారుల్లో జవాబుదారీతనం ఉండాల్సిందే

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



2



## రిజర్వేషన్లు ఖరారు

17 కార్పొరేషన్ లకు, 106 మున్సిపాల్టీలకు ప్రక్రియ పూర్తి

విశాఖ మేయర్ జనరల్ మహిళకు కేటాయింపు

బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, జనరల్ మహిళలకు 5, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీకి 4 స్థానాలు

(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల సమరం మట్నుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ పదవులతో పాటు, 106 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ..మిగతా 2లో

## మహిళకే అగ్రతాంబూలం

36 స్థానాలు బీసీలకు, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 కేటాయింపు

జనరల్ మహిళలకు 27, జనరల్ 26 ఖరారు

మహిళలకు 50 శాతం మున్సిపల్ ఛైర్ పర్సన్ పోస్టులు

2

# ఉద్రిక్తంగా చలో ఢిల్లీ..

ఇండియా కూటమి మార్చ్

పోలీసులకు, శ్రేణులకు మధ్య తోపులాట

సుప్రీంకోర్టు వరకు సాగిన నిరసన ర్యాలీ





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి ఢిల్లీలో చేపట్టిన 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు కుమ్మక్కై యువతను అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు ..మిగతా 2లో

## జంతర్ మంతర్ వద్ద నిరసనలు కుదరవు

కొత్తగా మూడు ప్రాంతాలు కేటాయింపు

ఢిల్లీ పోలీసులు చర్యలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్య నిరసనలకు నిలయంగా ఉన్న చారిత్రాత్మక జంతర్ మంతర్ వద్ద ఇకపై ధర్నాలు, ఆందోళనలు చేపట్టడానికి వీల్లేదు! దశాబ్దాలుగా ఉద్యమాలు, ధర్నాలకు వేదికగా నిలిచిన ఈ జంతర్ మంతర్‌ను నిరసనలు చేసే స్థలాల జాబితా నుంచి తొలగిస్తూ (డీ-నోటిఫై)ఢిల్లీ పోలీసులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జంతర్ మంతర్‌కి ప్రత్యామ్నాయంగా నిరసనకారుల కోసం నగరంలోని మూడు విభిన్న ప్రాంతాలను నూతన ధర్నా చౌక్‌లుగా ఖరారు చేశారు. పౌరులు తమ ఆందోళన తెలిపే హక్కును కాపాడుతూనే, నగరంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను అన్వేషించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇచ్చిన సమగ్ర నివేదిక, సిఫార్సుల ప్రాతిపదికగానే ఢిల్లీ పోలీసులు ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఢిల్లీలోని ల్యూటియన్స్ జోన్‌లో ఉన్న జంతర్ మంతర్ వీధి.. పార్లమెంట్ భవనం, నార్త్-సౌత్ బ్లాక్‌లు, ప్రధానమంత్రి కార్యాలయం, సుప్రీంకోర్టుకు అత్యంత సమీపంలో ఉంటుంది. ఇక్కడ నిత్యం ఏదో ఒక రకమైన నిరసన కార్యక్రమం జరగడం వల్ల ప్రధాన రహదారులపై రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ..మిగతా 2లో






## పెట్టుబడుల స్వర్గధామం ఏపీ

గత ప్రభుత్వంలో పూర్తిగా నమ్మకం పోయింది

పారిశ్రామికవేత్తలకు తీవ్రభయాందోళనలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

సీఐఐ ప్రాంతీయ సదస్సుకు హాజరు

(కాకినాడ - జయజయహే)

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మార్చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు తీవ్ర భయాందోళనలకు గురయ్యే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ..మిగతా 2లో



## నలుగురు సజీవదహనం

రెయిలింగ్‌ను ఢీకొన్న ఈవీ కారు

విజయవాడ బైపాస్ వ్ద దుర్ఘటన

అతి వేగంతో అదుపుతప్పిన వాహనం

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

(విజయవాడ - జయజయహే)

విజయవాడ నగర శివారులోని వెస్ట్ బైపాస్ రోడ్డుపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తీవ్ర వేగంతో వెళ్తున్న ఒక ఎలక్ట్రిక్ వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రభావంతో కారులోని బ్యాటరీ వ్యవస్థలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో ..మిగతా 2లో

## దూసుకొస్తున్న అల్పపీడనం

రాబోయే రెండు, మూడు రోజుల్లో వర్షాలు

గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు



(అమరావతి - జయజయహే)

దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో అక్టోబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చురుగ్గా సాగుతుండగా, రాబోయే 2-3 రోజుల్లో దక్షిణ ద్వీపకల్పంలో ఈశాన్య రుతుపవనాల వర్షాలు మొదలయ్యేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాంలలో రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చు. ఎల్లుండి రాయలసీమలోని కొన్ని చోట్ల, కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల ..మిగతా 2లో

### నేడు దుర్గమ్మ దర్శనానికి

## సీఎం విజయ్

సీఎం చంద్రబాబుతోనూ భేటీ

నదీ జలాల వివాదంపై చర్చ

(అమరావతి - జయజయహే)



నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ వారిని తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ దర్శించుకోనున్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి సోమవారం ఇంద్రకీలాద్రికి సీఎం భద్రతా సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ రూట్ మ్యాప్‌ను వారు పరిశీలించారు. మరో వైపు ఏపీలో సీఎం విజయ్ పర్యటన షెడ్యూల్‌ను తమిళనాడు సీఎం కార్యాలయం ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# ఉద్రిక్తంగా చలో ఢిల్లీ..

మొదటి పేజీ తరువాయి...

కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా బలగాలను భారీగా మోహరించి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

"ఈ రోజు దేశమంతా రోడ్లపైకి వచ్చింది. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఇక్కడకు చేరుకున్నారు. మా అందరి డిమాండ్ ఒక్కటే సుప్రీంకోర్టు మా వాదనను వినాలి. జజుజ చేసిన పని చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం. ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సిందే. మేము బయటపెట్టిన 'ఓట్ల చోరీ'కి సంబంధించిన ఆధారాలు, ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మనం పోరాడాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. మేము శాంతియుతంగా, గాంధేయ పద్ధతిలో మాట్లాడాలని అనుకుంటున్నాం. కానీ పోలీసులు యువతపై దాడులు చేస్తున్నారు. నాయకులను జైలుకు పంపుతున్నారు. ఇది తప్పు. సరైన చర్యలు తీసుకునేలా సుప్రీంకోర్టు మా వాదనను వినాలని నేను భావిస్తున్నాను. ఆ పదవిలో కొనసాగే హక్కు జజుజకి లేదు. ఈ ప్రభుత్వం తనను తాను



రక్షించుకోవడానికి పోలీసులను ముందుంచుతోంది." అని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు.

**దిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల మూసివేత**

మరోవైపు ఇండీ కూటమి ఆందోళనల నేపథ్యంలో దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఖవీ=జ) కీలక ప్రకటన చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా దిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేస్తున్నట్లు వెల్లడించింది. నిరసనలు జరిగే మార్గంలో ఉన్న జన్‌పథ్, మండి హౌస్, బారాఖంబా రోడ్, సెంట్రల్ సెక్రటేరియట్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది. అయితే ఈ స్టేషన్ల పరిధిలో మార్గాలు మారేందుకు ఉపయోగపడే ఇంటర్‌చేంజ్ సదుపాయం మాత్రం ప్రయాణికులకు యథాతథంగా అందుబాటులో ఉంటుందని డీఎంఆర్సీ తెలిపింది.

**జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటూ శాసనసభలో తీర్మానం**

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితా రూపకల్పనలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కేరళం రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటూ శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. సర్ ప్రక్రియలో పెద్దఎత్తున అర్హులైన ఓటర్ల పేర్లు గల్లంతు అయ్యాయని ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదంటూ ఈ తీర్మానంలో తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తొలగించిన ఓటర్లందరికీ వెంటనే ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేసిన కేరళం అసెంబ్లీ, భవిష్యత్తులో ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీని పునరుద్ధరించాలని కోరింది. ప్రధానితో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కమిటీలో ఉండేలా చట్ట సవరణ చేయాలని తీర్మానం ద్వారా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా "ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది. రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడేందుకే ఈ పోరాటం" అని కేరళం సీఎం సతీశన్ స్పష్టం చేశారు.



## మహిళకే అగ్రతాంబూలం

**36 స్థానాలు బీసీలకు, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 కేటాయింపు**

**జనరల్ మహిళలకు 27, జనరల్ 26 ఖరారు**

**మహిళలకు 50 శాతం మున్సిపల్ చైర్ పర్సన్ పోస్టులు**

(అమరావతి - జయజయహే)

మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ 106 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో ఈ రిజర్వేషన్ల ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తం మున్సిపాలిటీ చైర్మన్లలో బీసీలకు 36 స్థానాలు కేటాయించగా, ఎస్సీ 14, ఎస్టీ 3, జనరల్ మహిళలు 27, జనరల్ 26 (అన్‌రిజర్వ్‌డ్) సీట్లు కేటాయించారు. ఓవరాల్ గా చూస్తే మహిళలకు 50 శాతం మున్సిపల్ చైర్మన్ స్థానాలు కేటాయించినట్లు పేర్కొంది. ప్రభుత్వం అక్టోబర్ 14న స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

ఏపీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాల రిజర్వేషన్లు (షెడ్యూల్–×):

ఎస్టీ (ౡ) కేటగిరీ:

ఎస్టీ (జనరల్): 02 స్థానాలు, ఎస్టీ (మహిళ): 01 స్థానం

ఎస్సీ (ౡజ) కేటగిరీ:

ఎస్సీ (జనరల్): 07 స్థానాలు, ఎస్సీ (మహిళ): 07 స్థానాలు

బీసీ (దీజ) కేటగిరీ:

బీసీ (జనరల్): 18 స్థానాలు, బీసీ (మహిళ): 18 స్థానాలు

మహిళల కేటగిరీ: మహిళలు (జనరల్): 27 స్థానాలు

అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీ:

అన్‌రిజర్వ్‌డ్ (సాధారణ): 26 స్థానాలు

మొత్తం స్థానాలు: 106

మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం

మున్సిపల్ చైర్మన్ల రిజర్వేషన్ల కేటాయింపులో మహిళా సాధికారతకు ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వం మొత్తం మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించింది. అన్ని వర్గాల మహిళలకు కలిపి సగం స్థానాలు దక్కడంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో మున్సిపల్ చైర్‌పర్సన్లుగా మహిళల ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది.

పురపాలక సంఘాలు: 106

ఎస్టీలకు 3 స్థానాలు..

గూడూరు: ఎస్టీ–మహిళ

ఆత్మకూరు (ఖ), ఆలూరు: ఎస్టీ–జనరల్:

ఎస్సీలకు 14 స్థానాలు...

ౡజ మహిళలు: చింతలపూడి, సూళ్లూరుపేట, కొండపల్లి, నిడదవోలు, ఏలేశ్వరం, గుత్తి, చీరాల.

ౡజ జనరల్: ఉయ్యూరు, సామర్లకోట, పిఠాపురం, నూజివీడు, కుప్పం, పొదిలి, బాపట్ల.

బీసీలకు 36 స్థానాలు..

దీజ మహిళలు (18): ఆళ్లగడ్డ, సాలూరు, ఇచ్ఛాపురం, నర్సీపట్నం, యర్రగుంట్ల, జంగారెడ్డిగూడెం, పాలకొండ, తుని, పాలకొల్లు, కదిరి, పుంగనూరు, రాజంపేట, గుడివాడ, రాజాం, గుంతకల్లు, గూడురు (కే), నందికొట్కూరు, ముమ్మిడివరం.

దీజ జనరల్ (18): పిడుగురాళ్ల, పూత్తూరు, బేతంచర్ల, రామచంద్రాపురం, సత్తెనపల్లి, శ్రీకాళహస్తి, మదనపల్లె, తాడిపత్రి, తిరువూరు, నంద్యాల, హిందూపురం, మడకశిర, నెల్లిమర్ల, పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, తాడిగడప, బి.కొత్తకోట

జనరల్ మహిళలకు కేటాయించిన స్థానాలు.. 27

కనిగిరి, కమలాపురం, కొవ్వూరు, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాళెం, యలమంచిలి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు (చీ), నరసాపురం, పలాస- కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పొన్నూరు, భీమవరం, చిలకలూరిపేట, జగ్గయ్యపేట, ఆమదాలవలస, మాచర్ల, ఆదోని, నాయుడుపేట, డోన్, బొబ్బిలి, రేపల్లె, పార్వతీపురం, పులివెందుల

అన్ రిజర్వ్‌డ్ స్థానాలు 26:

తణుకు, తెనాలి, గురజాల, తాడేపల్లిగూడెం, అమలాపురం, ఎమ్మిగనూరు, కావలి, ప్రొద్దుటూరు, నందిగామ, కందుకూరు, మండపేట, దాచేపల్లి, నగరి, చీమకుర్తి, రాయదుర్గం, గిద్దలూరు, వినుకొండ, గొల్లప్రోలు, అద్దంకి, పెద్దాపురం, ధర్మవరం, బద్వేల్, దర్శి, మార్కాపురం, మైదుకూరు, నరసరావుపేట.

### నేడు దుర్గమ్మ దర్శనానికి

## సీఎం విజయ్

మొదటి పేజీ తరువాయి...

విడుదల చేసింది. ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు రావాలంటూ తమిళనాడు సీఎం జోసఫ్ విజయ్‌ను టీడీపీ ఎంపీలు స్వయంగా కలిసి ఆహ్వానించారు. ఇటీవల చెన్నైలో సీఎం విజయ్‌ను ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జీఎం హరీశ్ బాలయోగి కలిసిన సంగతి తెలిసిందే.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం ఏపీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్..

మధ్యాహ్నం 02:30 గంటలకు నీలంకరై క్యాంప్ ఆఫీస్ నుంచి సీఎం విజయ్ బయలుదేరుతారు.

మధ్యాహ్నం 03:00 గంటలకు చెన్నై విమానాశ్రయం నుంచి విజయవాడకు బయలుదేరుతారు.

సాయంత్రం 04:00 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

సాయంత్రం 04:00 – 04:10 గంటలకు విమానాశ్రయంలో సీఎం విజయ్‌కు స్వాగతం పలకనున్న ప్రముఖులు.

సాయంత్రం 04:10 గంటలకు విమానాశ్రయం నుంచి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయానికి బయలుదేరుతారు.

సాయంత్రం 04:55: కనకదుర్గ ఆలయానికి చేరుకుంటారు.

సాయంత్రం 05:00 – 05:45 దుర్గమ్మ దర్శనం.

సాయంత్రం 05:45 గంటలకు దుర్గమ్మ ఆలయం నుంచి ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్తారు.

సాయంత్రం 06:00 నుంచి 07:00 గంటలు మధ్య ఇరు రాష్ట్రాల సీఎంలు నదుల అనుసంధానంపై చర్చించనున్నారు.

ఎ) గోదావరి – కావేరీ నదుల అనుసంధాన ప్రాజెక్ట్

బి) కృష్ణా నీటి విడుదల.

తమిళనాడు జలవనరుల శాఖ మంత్రి, ప్రధాన కార్యదర్శి, ఏపీ జలవనరుల శాఖ మంత్రి, ప్రధాన కార్యదర్శి, జలవనరుల శాఖ కార్యదర్శి, సీఎంఓ అధికారులు ఈ చర్చల్లో పాల్గొంటారు.

సాయంత్రం 07:00 గంటలకు ముఖ్యమంత్రి నివాసం నుంచి పున్నమి ఘాట్ వద్ద ఉన్న ఉత్సవ్ మైదానానికి రోడ్డు మార్గంలో బయలుదేరుతారు.

రాత్రి 07:10 గంటలకు విజయవాడ ఉత్సవ వేడుకల్లో పాల్గొంటారు.

రాత్రి 07:10 – 08:00 గంటలకు ఉత్సవ కార్యక్రమాలు

రాత్రి 08:00 గంటలకు ఉత్సవ వేదిక నుంచి సీఎం విజయ్ గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు.

రాత్రి 08:50 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు.

రాత్రి 09:00 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి చెన్నై బయలుదేరుతారు.

రాత్రి 10:00 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంటారు.

రాత్రి 10:30 గంటలకు క్యాంప్ ఆఫీసుకు సీఎం విజయ్ చేరుకుంటారు.

## రిజర్వేషన్లు ఖరారు

మొదటి పేజీ తరువాయి...

ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా రొటేషన్ పద్ధతిలో ఈ కేటాయింపులు పూర్తి చేశారు. రాష్ట్రంలోని 17 నగరపాలక సంస్థల్లో బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, జనరల్ మహిళలకు 5, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీ కింద 4 స్థానాలను కేటాయించారు.

ఎస్టీ – మంగళగిరి – తాడేపల్లి

ఎస్సీ – రాజమహేంద్రవరం, కర్నూలు

బీసీ మహిళ– మచిలీపట్నం, కాకినాడ

బీసీ జనరల్– ఏలూరు, అనంతపురం, చిత్తూరు

జనరల్ మహిళ – గ్రేటర్ విశాఖపట్నం, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, కడప

అన్‌రిజర్వ్‌డ్ – విజయవాడ, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు

ఈ కేటాయింపుల ద్వారా విశాఖపట్నం, గుంటూరు వంటి కీలక మహానగరాలతో పాటు మొత్తం 7 కార్పొరేషన్లలో మహిళలే మేయర్ పీఠాన్ని అధిరోహించనుండటం విశేషం. రాష్ట్రంలోని 106 పురపాలక సంఘాలకు (మున్సిపాలిటీలు) కూడా రిజర్వేషన్ల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. సామాజిక వర్గాల వారీగా ఛైర్‌పర్సన్ స్థానాల కేటాయింపులు ఇలా ఉన్నాయి. ఎన్నికల బరిలో రాజకీయ సమీకరణాలురిజర్వేషన్ల ప్రకటనతో ఏపీ రాజకీయాల్లో ఎన్నికల వేడి ఒక్కసారిగా పెరిగింది. రొటేషన్ నిబంధనల ప్రకారం గతంలో కేటాయించిన స్థానాల్లో మార్పులు చోటుచేసుకోవడంతో ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఎస్టీ (3 స్థానాలు): ఎస్టీ జనరల్ -- 2, ఎస్టీ మహిళ -- 1

ఎస్సీ(14 స్థానాలు): ఎస్సీ జనరల్ -- 7, ఎస్సీ మహిళ -- 7

బీసీ (36 స్థానాలు): బీసీ జనరల్ -- 18, బీసీ మహిళ -- 18

సాధారణ కేటగిరీ (53 స్థానాలు): జనరల్ -- 26, జనరల్ మహిళ -- 27



## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయెుద్దు

**అధికారుల్లో జవాబుదారీతనం ఉండాల్సిందే**

**తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

**ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు**

(అమరావతి - జయజయహే)

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం రాజధాని అమరావతిలోని ఆర్టీజీఎస్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అధికారులను ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని అన్నారు. మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలని సూచించారు. అయితే వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారని వివరించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోలపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నలుగురు సజీవదహనం

మొదటి పేజీ తరువాయి...

కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవదహనం కాగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణమైన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు, అగ్నిమాపక రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే నలుగురు కాలిబూడిదయ్యారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిని పోలీసు యంత్రాంగం గుర్తించింది. మృతులు నున్నకు చెందినవారిగా అధికారులు తెలుసుకున్నారు. చనిపోయినవారిలో కొమ్మారెడ్డి రాందేవ్, కొమ్మారెడ్డి అరుణ (రాందేవ్ తల్లి), ఒక చిన్నారి, తిగురు విజయ ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న మృతుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని స్థానిక ఆసుపత్రి అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసుతం అతని పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. వాహనం మితిమీరిన వేగంతో ప్రయాణించడమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని విజయవాడ పోలీసులు తెలిపారు. వాహనం వేగంగా రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఈవీ కారు బ్యాటరీ బ్యాక్‌పై తీవ్రమైన ప్రభావం పడి, క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపించినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

## దూసుకొస్తున్న అల్పపీడనం

మొదటి పేజీ తరువాయి...

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. రాగల మూడు రోజుల పాటు తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు, గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు పూర్తిగా పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింతగా ఉపసంహరించుకున్నాయని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పొడి గాలుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

## జంతర్ మంతర్ వద్ద నిరసనలు కుదరవు

మొదటి పేజీ తరువాయి...

తీవ్రస్థాయిలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి సాధారణ పౌరులు, అత్యవసర వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దీనికి తోడు ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున నిరసనకారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం, భద్రతా కారణ దృష్ట్యా వేలాది మందిని అదుపులోకి తీసుకోవడం, నగరంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 వంటి ఆంక్షలు విధించాల్సి రావడం వల్ల ఈ వేదిక మార్పు నిర్ణయం త్వరితగతిన కార్యరూపం దాల్చింది. సీజేపీ నిరసనలతో ఇటీవలి కాలంలో జంతర్ మంతర్ పేరు తరచూ వార్తల్లో వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఇకపై ఎవరైనా నిరసనలు తెలపాలంటే నిర్దేశిత మూడు మైదానాల్లో మాత్రమే అనుమతి లభిస్తుంది. కొత్త ఎస్ఓపీల ప్రకారం మైదానాల సామర్థ్యం, మైకుల వాడకంపై పరిమితులు, సమయ వేళలు, పార్కింగ్ సదుపాయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రానున్నాయి. ఈ నిర్ణయం వల్ల దిల్లీ నడిబొడ్డున రద్దీ తగ్గడంతో పాటు, నిరసనకారులకు విస్తృతమైన స్థలం అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

**పోలీసులు కొత్తగా కేటాయించిన మూడు వేదికలు:**

రామ్‌లీలా మైదాన్ (సెంట్రల్ దిల్లీ)

బురారీ మైదాన్ (ఉత్తర దిల్లీ)

సీబీడీ మైదాన్ (తూర్పు దిల్లీ – సీబీడీ (గ్రౌండ్స్)

ఈ నూతన వేదికల్లో నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడానికి పాటించాల్సిన రివైజ్డ్ ప్రామాణిక నిర్వహణ విధానాలను దిల్లీ పోలీసులు త్వరలోనే విడిగా విడుదల చేయనున్నారు.

# ఆయుర్వేద చికిత్స కోసం వెళుతున్నా..

### ఎన్నికల కోడ్ తర్వాత పార్టీ ప్రకటిస్తా
### అంతలోనే వెనక్కి తగ్గారా అని అనుమానాలు

**(హైదరాబాద్ - జయజయహే)**



మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం విషయంలో వాయిదా వేసుకున్నారు. మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఆయుర్వేద చికిత్స కోసం వెళుతున్నానని తెలిపారు. ఏపీలో స్థానికసంస్థల ఎన్నికల కోడ్ తర్వాత తన పార్టీ ఆవిర్భావ దినోత్సవ తేదీని ప్రకటిస్తానని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. గత కొన్ని రోజుల నుంచి ఏపీలో సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అని, కేవలం రెండు కుటుంబాలే రాష్ట్రాన్ని పాలిస్తున్నాయని.. వారి వల్ల ప్రజలకు ఏ ప్రయోజనం లేదని విమర్శించారు. తాను స్థాపించే పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థిని తాను కాదని, ఓ విద్యావేత్త, రాజకీయాలపై పట్టున్న వ్యక్తికి సీఎం సీటు ఇస్తానని ప్రకటించారు. తాను స్థాపించే పార్టీలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత, జెన్‌జీలకు సైతం సీట్లు కేటాయిస్తామని విజయసాయి-ంరెడ్డి ప్రకటించారు.

**అంతలోనే వెనక్కి తగ్గారా**

దసరా పండుగ తర్వాత రోజే తన రాజకీయ పార్టీని ప్రకటిస్తానని విజయాసాయిరెడ్డి ప్రచారం చేస్తూ వచ్చారు. పలు ప్రాంతాల్లో వారానికి ఒకటి చొప్పున ప్రెస్‌మీట్లు సైతం పెట్టారు. తన పార్టీలో జెన్ జీకి, మేధావులకు ప్రాధాన్యం అన్నారు. రెడ్ల ఆత్మగౌరవం కోసం పార్టీ పెట్టానని, రాయలసీమ అసలైన రెడ్ల పౌరుషం చూపిస్తామన్నారు. కానీ, సమయం దగ్గర పడగా ఉన్నట్టుండి ఇప్పుడు ఆయుర్వేద చికిత్స పేరు చెప్పి విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావంపై వాయిదా వేశారు. విజయసాయిరెడ్డికి పార్టీ ప్రకటించే ఉద్దేశం లేదని అందుకే చివరి క్షణంలో అనారోగ్య కారణాలతో ఆగిపోయారని ఆయన సన్నిహిత వర్గాల్లో వినిపిస్తోంది. దీనికి కారణం ఏమిటని స్పష్టత లేదు. కుటుంబసభ్యులతో పాటు వైసీపీ పెద్దల నుంచి కూడా ఒత్తిడి వచ్చి ఉంటుందని ప్రచారం జరుగుతోంది.

# "గ్రూప్-2" మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు గడువు
### మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, అక్టోబరు 12 (జయ జయహే)**



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్-2 ఉద్యోగాల కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ నెలాఖరు 31వ తేదీ లోగా అర్హత కలిగిన వారందరూ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు.మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) నేతృత్వంలో అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్-2 నియామక పరీక్షల కోసం ఆన్ లైన్/ఆఫ్ లైన్ లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు.ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.బిపిఎల్ కార్డు కలిగి ఉండటం ఆఫ్‌లైన్ కోచింగ్‌కు తప్పనిసరి అర్హతగా పరిగణించబడుతుందని వెల్లడించారు.దరఖాస్తు సమయంలో సంబంధిత బిపిఎల్ కార్డు( తెల్ల రేషన్ కార్డు)/ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ -2 ఉద్యోగాల సాధన కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్ తో పాటు నియామక పరీక్షకు నిర్దేశించిన ఇతర సంబంధిత అంశాలపై పూర్తి దృష్టి సారిస్తారని తెలిపారు.మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను"సిఈడియం-ఏపీ" అధికారక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని కోరారు. వెబ్ సైట్ : www.apcedmmwd.org లేదా సెల్ నెంబర్లు: 08645-297535, 7386789966 లను సంప్రదించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.



# మాజీ సైనికుల అనుభవాలు దేశాభివృద్ధికి దోహదపడాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**నరసన్నపేట. - (జయ జయహే)**

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణకు అంకితమైన మాజీ సైనికులు, సైనిక సేవల నుంచి విరమణ పొందిన తరువాత కూడా తమ అనుభవాన్ని సమాజ అభ్యున్నతికి వినియోగించాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో కూడిన సైనికుల జీవన విధానం యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. నరసన్నపేటలోని ఎస్ఏఆర్ హాల్‌లో త్రివిధ దళాల విశ్రాంత సైనికుల ఆత్మీయ సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నరసన్నపేట సమన్వయకర్త పోకతోట సింహాచలం ఆధ్వర్యంలో, శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా, పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. సత్యవరం కూడలి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించిన ర్యాలీ అనంతరం పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికులు అందించిన సేవలు వెలకట్టలేనివని, ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే సైనికుల త్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. అలాంటి త్యాగమూర్తులకు సమాజంలో సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సైనిక జీవితంలో నేర్చుకున్న క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలను సామాజిక సేవలోనూ ప్రతిబింబించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని నాయకులు వివరించారు. మాజీ సైనికులు, వారి కుటుంబాలకు పింఛను ప్రయోజనాలు అందించడంలో 'ఒకే ర్యాంకు--ఒకే పింఛను' విధానం ప్రాధాన్యతను ప్రస్తావించారు. అలాగే మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించే ఆరోగ్య పథకాలు, పునరావాసం, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.




# ఐఎఎస్‌లపై బదిలీపై నిషేధం

### పోస్టింగులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారుల బదిలీ, పోస్టింగులపై నిషేధాన్ని పొడిగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అక్టోబర్ 16 వరకు బదిలీలను నిషేధిస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల నేపథ్యంలో ఐఏఎస్‌ల బదిలీలను తాత్కాలికంగా నిలివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితా సవరణ పూర్తయ్యే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను సవరించే పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయని.. ఈ సమయంలో ఐఏఎస్‌లను బదిలీ చేయడం వల్ల పనుల్లో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికల అనంతరం ఉన్నతాధికారుల బదిలీలు, పోస్టింగులు అమల్లోకి రానున్నట్లు సమాచారం.

# ధరలను నియంత్రిస్తాం

### రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు
### ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

**(విజయవాడ - జయజయహే)**



నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు తక్కువ ధరకే అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇప్పటికే రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బీపీటీ రకం సన్నబియ్యాన్ని తక్కువధరకు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. విజయవాడ భవానీపురం రైతు బజారులో సన్నబియ్యం విక్రయాలను మంత్రి ప్రారంభించారు. బీపీటీ సన్నబియ్యం కిలో 49 రూపాయాలు, కేఎన్ఎమ్-ఆర్ ఎన్ఆర్ సన్నబియ్యం కిలో 50 రూపాయలు చొప్పున 26 కిలోల బ్యాగుల రూపంలో లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ కమిషనర్ కన్నబాబుతో పాటు వివిధ విభాగాలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిత్యావసర వస్తువులను మరింత తక్కువ ధరలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. భారం తగ్గించడమే కూటమి లక్ష్యం : రాష్ట్రవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడలోని భవానీపురం రైతు బజారులో బిపిటి, కేఎన్ఎం/ఆర్ఎన్ఆర్ రకం సన్నబియ్యం విక్రయాలను పౌర సరఫరాల సంస్థ కమిషనర్ కన్నబాబుతో కలిసి మంత్రి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పండుగ వేళల్లో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలిగించేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మార్కెట్లో సన్నబియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, ప్రభుత్వ ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని అతి తక్కువ ధరకే అందిస్తున్నట్లు ప్రకటించారు.

**ఉల్లిపాయలు: బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజార్ల ద్వారా కిలో రూ.35 లకే సరఫరా.**

"అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటుంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ప్రజలకు మేలు చేసే విధంగా కార్యక్రమాలన్ని అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజలు ఎక్కువగా కోరుకునే బీపీటీ, నెల్లూరు సన్నబియ్యం రకాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకువచ్చాం" అని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ సరుకులను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించి, సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిత్యావసర వస్తువులను మరింత తక్కువ ధరలకు అందిస్తామని, త్వరలోనే కందిపప్పును కూడా సబ్సిడీ ధరకే అందుబాటులోకి తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.




# పెట్టుబడుల స్వర్గధామం ఏపీ

ఆ చీకటి రోజులు పోయి, రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణం నెలకొందని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్‌పై పూర్తిగా నమ్మకం పోయిందన్నారు. ఆ కోల్పోయిన నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించిందని పవన్ వివరించారు. రాష్ట్రంలో పర్యావరణ హితంగా పారిశ్రామికవేత్తలు పెట్టే ప్రతి పెట్టుబడికి తమ ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే యాజమాన్యాలు కేవలం లాభాలపైనే దృష్టి పెట్టకుండా, తమ పరిసర గ్రామాల అభివృద్ధి బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటు పేరుతో వాతావరణాన్ని, అమూల్యమైన ప్రకృతి వనరులను కలుషితం చేయవద్దని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు.

**పారిశ్రామికవేత్తలతో కీలక ఒప్పందాలు:**

వచ్చే నవంబర్ నెలలో విశాఖపట్నంలో భారీ స్థాయిలో పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దీనికి సన్నాహకంగా కాకినాడలో సీఐఐ ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేశ్ హాజరయ్యారు. ఈ సదస్సు వేదికగా పారిశ్రామికవేత్తలతో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ యువతకు కీలక సూచనలు చేశారు. నైపుణ్యం కలిగిన విద్యార్థులు కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పష్టం చేశారు. నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా గత రెండున్నరేళ్లలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని వెల్లడించారు. రిసార్టులు, స్టార్ హోటళ్లు, క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టేలు, వెల్‌నెస్ కేంద్రాలు, ఎకో టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుకు విస్తృత అవకాశాలున్నాయన్నారు. అవసరమైతే ఇతర శాఖల భూములను సైతం పర్యాటక ప్రాజెక్టులకు కేటాయిస్తామని, పరిశ్రమలకు వర్తించే రాయితీలను పర్యాటక పెట్టుబడిదారులకూ అందిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 1,053 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధికి ఉపయోగించుకుంటామని చెప్పారు.



# మంగళగిరిలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జులకు శిక్షణ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన యూనిట్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన యూనిట్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. నెమళ్లూరు బుజ్జి, రామకృష్ణ యాదవ్, ముని రాజా యాదవ్, ఆర్ముగం, మందల రామ్మూర్తి తదితరులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జుల విధులు, బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో మమేకమయ్యే విధానాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దిశానిర్దేశంలో 2029లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ శిక్షణ తమ రాజకీయ జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు స్ఫూర్తినిచ్చిందని పాల్గొన్న నాయకులు తెలిపారు.




# జీరో పావర్టీ మిషన్‌పై శిక్షణ

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్12, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓ లీడర్లు, వీఓఏలకు జీరో పావర్టీ మిషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ ప్రణాళిక సంఘం మార్గదర్శకాల ప్రకారం స్వర్ణ గ్రామాల వారీగా అర్హుల జాబితాలను రూపొందించి, నిర్ణీత గడువులోగా తుది జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు.ఈ నెల 25వ తేదీలోపు గ్రామ సమాఖ్య ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 5 వరకు అర్హుల జాబితాలను పంచాయతీల్లో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. అనంతరం పరిశీలన పూర్తి చేసి నవంబర్ 6 నుంచి 15వ తేదీలోపు గ్రామ సమాఖ్య సమావేశాల్లో తుది జాబితాలకు ఆమోదం తెలపాలన్నారు. నవంబర్ 16 నుంచి 25వ తేదీలోపు జీరో పావర్టీ మిషన్ యాప్‌లో అర్హులు, అనర్హుల వివరాలను 100 శాతం నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీసీలు పయని, జీవ, వెంకటరత్నం, అకౌంటెంట్ హిమగిరిజ, ఎంఎస్ లీడర్లు శ్వేత, భారతి, లావణ్య, సంఘమిత్రలు, గ్రామ సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయ జయహే



## ఆర్థిక రంగంలో అలజడి... మార్కెట్లు, చమురు, రూపాయిపై దృష్టి

(ప్రతాప్)

### సెన్సెక్స్‌కు భారీ ఎదురుదెబ్బ.. 548 పాయింట్ల నష్టం

వారాంతపు తొలి ట్రేడింగ్ రోజున దేశీయ స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 548 పాయింట్లు కోల్పోయి 71,925 వద్ద ముగియగా, నిఫ్టీ 157 పాయింట్లు తగ్గి 22,363 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ బాండ్ యీల్డ్‌ల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల విక్రయాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, లాభాల స్వీకరణ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.




**రూపాయి కదలికలపై పెట్టుబడిదారుల దృష్టి**

ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో రూపాయి మారకపు విలువపై మార్కెట్ వర్గాలు నిశితంగా దృష్టి సారించాయి. సోమవారం రూపాయి డాలర్‌తో పోలిస్తే బలపడినప్పటికీ, అంతర్జాతీయ చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు, ప్రపంచ ఆర్థిక పరిణామాలు రాబోయే రోజుల్లో దాని దిశను నిర్ణయించే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**2047 లక్ష్యంగా ఉక్కు రంగానికి విస్తరణ ప్రణాళిక**

ఉక్కు రంగంలో దీర్ఘకాలిక వృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'విజన్--2047' ముసాయిదా విధానం పరిశ్రమలో చర్చనీయాంశమైంది. ఈ ప్రణాళిక ప్రకారం దేశ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2047 నాటికి 604 మిలియన్ టన్నులకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, తయారీ రంగ విస్తరణ, ఎగుమతుల పెరుగుదలకు ఈ విధానం తోడ్పడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

**చమురు ధరల పెరుగుదలపై ఆందోళన**

మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగుతున్నాయి. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారతదేశానికి ఇది కీలక అంశంగా మారింది. ధరలు అధిక స్థాయిలో కొనసాగితే దిగుమతి వ్యయం, ద్రవ్యోల్బణం, పరిశ్రమల ఖర్చులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కరువును ఎదుర్కొందాం.. రైతును కాపాడుదాం!

(సి.హెచ్. ప్రతాప్)

**పొలంలో పంట ఎండిపోతే రైతు కోల్పోయేది దిగుబడి మాత్రమే కాదు; పెట్టుబడి, కుటుంబానికి ఆదాయం, మరో పంట వేసే ధైర్యం కూడా. వాన కోసం ఎదురుచూసిన అన్నదాత ఇప్పుడు సాగునీటి కోసం ఆందోళన చెందుతున్నాడు. ఈ పరిస్థితుల్లో కరువు సహాయం నష్టపరిహారంతో ముగియకూడదు. అప్పుల ఒత్తిడిని తగ్గించి, తదుపరి సాగుకు రైతును నిలబెట్టగల సమగ్ర కార్యాచరణ అవసరం. రైతుకు అందించే ప్రతి సహాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, మన ఆహార భద్రతకు పెట్టుబడిగా భావించాలి.**



తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అధికారులు ముఖ్యమంత్రికి అందించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 612 మండలాల్లో 235 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొన్నాయి. అంటే సుమారు 38 శాతం మండలాలు వర్షాభావ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అక్టోబర్ 12న ఈ పరిస్థితులపై మంత్రివర్గం చర్చించనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. కేంద్రాన్ని రాష్ట్రం కోరిన రూ.20,000 కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని, నిర్ధారిత పంటనష్టం మొత్తంగా భావించకూడదు.

నీటి నిల్వల పరిస్థితి కూడా ముందస్తు ప్రణాళిక అవసరాన్ని స్పష్టం చేస్తోంది. సెప్టెంబర్ 24 నాటి కేంద్ర జలసంఘం నివేదికను ఉటంకించిన కథనం ప్రకారం, దేశంలోని 178 ప్రధాన జలాశయాల్లో నిల్వలు మొత్తం సామర్థ్యంలో 70 శాతంగా ఉన్నాయి; పదేళ్ల సగటు 76.62 శాతం. దక్షిణాదిలో నిల్వలు 50 శాతంగా ఉండగా, గతేడాది ఇదే సమయంలో 87.25 శాతం ఉన్నాయి. ఇవి ప్రాంతీయ గణాంకాలైనప్పటికీ, సాగు నిర్ణయాల్లో నీటి లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

మొదట పంటనష్టాన్ని గ్రామస్థాయిలో వేగంగా అంచనా వేయాలి. వ్యవసాయ అధికారులు, స్థానిక సిబ్బంది సంయుక్త పరిశీలనతో వివరాలను నమోదు చేసి, రైతుకు తన దరఖాస్తు స్థితి తెలిసేలా చేయాలి. పంటవారీ నష్టం, సాగు విస్తీర్ణం, పెట్టుబడి వివరాలను పారదర్శకంగా ప్రకటిస్తే సహాయం లక్ష్యానికి చేరుతుంది. పరిహారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా కాలపరిమితితో ప్రక్రియ పూర్తి చేయాలి. భూమి యజమానితోపాటు వాస్తవంగా సాగుచేసిన కౌలు రైతును గుర్తించాలి. స్థానిక ధ్రువీకరణతో అతనికీ సహాయం అందే మార్గం కల్పించాలి.



తదుపరి సాగుకు తక్కువ వడ్డీ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, సకాలంలో వ్యవసాయ సలహాలు అందించాలి. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో తక్కువ వ్యవధి, తక్కువ నీటి అవసరమున్న పంటలను నేల స్వభావం, మార్కెట్ అవకాశాలకు అనుగుణంగా సూచించాలి. పంట మార్పిడికి ప్రోత్సాహంతోపాటు కొనుగోలు భరోసా కల్పిస్తేనే రైతు కొత్త నిర్ణయం తీసుకోగలడు. మండలాలవారీగా నీటి లభ్యతను ప్రకటించి, రైతులతో సంప్రదించి సాగు ప్రణాళిక రూపొందించాలి. సూక్ష్మసేద్య పరికరాలకు సహాయం, మరమ్మతు సేవలు కూడా అందుబాటులో ఉండాలి.

పశుగ్రాస నిల్వలు, పశువులకు తాగునీరు, మొబైల్ పశు వైద్య సేవలను సిద్ధం చేయాలి. వ్యవసాయ పనులు తగ్గిన గ్రామాల్లో ఉపాధి పనులను విస్తరించి, చెరువుల పూడికతీత, కుంటల పునరుద్ధరణ, నీటి సంరక్షణకు అనుసంధానించాలి. పనులకు సకాలంలో వేతనాలు అందితే కుటుంబాల రోజువారీ అవసరాలు తీరడంతోపాటు వలసల ఒత్తిడి తగ్గుతుంది. తాగునీటికి ప్రాధాన్యమిస్తూ సాగు, విద్యుత్ అవసరాలను సమన్వయంతో నిర్వహించాలి.

కరువును ఎదుర్కోవడం అంటే ఎండిన పంటకు పరిహారం చెల్లించడం మాత్రమే కాదు. రైతు మళ్లీ విత్తనం చేతపట్టే నమ్మకాన్ని కల్పించడం. పొలానికి నీరు ఎంత అవసరమో, అన్నదాతకు భరోసా అంత అవసరం!

# శరన్నవరాత్రుల ప్రత్యేక శీర్షిక మూడవరోజు

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణ విశేషము - నైవేద్యము

**శరన్నవరాత్రి మహోత్సవాల్లో 3వ రోజు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అన్నీ దానములలో అన్నదానం అత్యంత విశిష్టమైనది.**



**అమ్మవారి రూపం**

చేతిలో అక్షయ అన్నపాత్ర - రసపాత్ర ధరించి, మరో చేతిలో బంగారు గరిటెతో దర్శనమిస్తారు.

ఆది భిక్షువైన ఈశ్వరుడికి సైతం భిక్ష పెట్టిన దేవత ఈమె. అందుకే ఈ రూపంలో శివుడికి భిక్ష సమర్పిస్తున్న స్వరూపంలో కరుణిస్తారు.

**అలంకరణ తత్వం**

సకల ప్రాణికోటికి జీవనాధారం అన్నం. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు.

ప్రపంచ సృష్టి పోషకురాలు 'అమ్మ' అనే అంతరార్థం ఈ అవతారంలో కనిపిస్తుంది. అమ్మ ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుంది. బాలా త్రిపురసుందరిగా కోరికలు తీర్చే అమ్మ, అన్నపూర్ణగా ఆకలి తీరుస్తుంది అని స్థల పురాణం చెబుతుంది.

**పూజా విశేషాలు**

చీర రంగు: పసుపు, గంధం రంగు

పూల రంగు: తెలుపు - తెల్ల చామంతులు, తెల్ల తామరలు

**నైవేద్యం:**

దధ్యోజనం, కట్టె పొంగలి, పరమాన్నం, అల్లం గారెలు.

పారాయణం: అన్నపూర్ణాష్టకం

**పవిత్ర శ్లోకం**

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ!
నిర్ధూతాఖిల ఘోర పావనకరీ ప్రత్యక్ష మాహేశ్వరీ!
ప్రాలేయాచల వంశపావనకరీ కాశీపురాధీశ్వరీ!
భిక్షాం దేహి! కృపావలంబనకరీ! మాతాన్నపూర్ణేశ్వరీ!!

**దర్శన ఫలితము**

అన్నపూర్ణ అవతారం లో అమ్మవారిని ధ్యానిస్తే మేధాశక్తి వృద్ధి, మధుర భాషణం, సమయస్ఫూర్తి, వాక్ సిద్ధి, భక్తిశ్రద్ధలు, ఐశ్వర్యం కలుగుతాయి.

అన్నపూర్ణేశ్వరి అనుగ్రహంతో ఆయుష్షు, ఆరోగ్య ఐశ్వర్యాలు, ధన ధాన్య వృద్ధి, మనసుకు సుప్రసన్నత కలుగుతాయని, అన్నదాతలై తులతూగుతారని, జ్ఞాన వైరాగ్యాలు పొంది ముక్తిని సాధిస్తారని విశ్వాసం.

దానాలలో అన్నదానం అన్నిటికన్నా మిన్న. ఈ రోజున అన్నదానం చేస్తే దారిద్ర్య నివృత్తి, సర్వదోష శాంతి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

**రచన**

**ఏ బాల సౌజన్యకుమారి**

**తెలుగు ఆచార్యులు,**

**నంది అవార్డు గ్రహీత,**

**ఆధ్యాత్మికవేత్త,**

**ప్రవచనకర్త.**





## రైతుకు భరోసా.. ప్రజలకు చౌక!

### ధవళేశ్వరంలో రూ.45 లక్షలతో రైతు బజార్ ప్రారంభం

### త్వరలో కడియం, రాఘవపురంలోనూ ఏర్పాటు: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమహేంద్రవరం జయ జయహే : అక్టోబర్ 12**

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందించడమే లక్ష్యంగా ధవళేశ్వరంలో రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన రైతు బజార్‌ను సోమవారం రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. రైతులు పండించిన కూరగాయలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకోవడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటు ధరల్లో లభిస్తాయని ఆయన తెలిపారు. ధవళేశ్వరం పరిసర ప్రాంతాల్లో సుమారు 50 వేల మంది జనాభా ఉన్న నేపథ్యంలో ఈ రైతు బజార్ స్థానిక రైతులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రాంతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో కడియం, రాఘవపురంలోనూ రైతు బజార్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ధవళేశ్వరం కొండపై ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తాగునీటి సదుపాయాల కోసం రూ.80 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బొమ్మూరు కాంప్లెక్స్ నుంచి ధవళేశ్వరం వరకు తాగునీరు అందించే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ప్రసిద్ధ శ్రీ జనార్దన స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించామని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం. సునీల్ వినయ్ మాట్లాడుతూ, రూ.45 లక్షలతో నిర్మించిన ఈ రైతు బజార్ ద్వారా ధవళేశ్వరం పరిసర ప్రాంతాల రైతులు తాము పండించిన తాజా కూరగాయలను నేరుగా విక్రయించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారుల చిరకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ బజార్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెటింగ్ శాఖకు చెందిన ఎం. సునీల్ కుమార్, రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బి. భారతి, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఎన్. మణికంఠ నాయుడు, ఎస్. రోజియా, సతీష్ కుమార్, రామకృష్ణ, ఐటివి అప్పాజీరావు, ఈ. భాస్కరరావు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పట్టాలు సరే.. స్థలాలేవీ?

### 25 వేల కుటుంబాలకు స్థలాలు అప్పగించాలి: మార్గాని భరత్

### కార్పొరేషన్ ఎదుట వైసిపి మహాధర్నా

**రాజమహేంద్రవరం, జయ జాయిహే**



నిరుపేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలకు సంబంధించిన స్థలాలను వెంటనే స్వాధీనం చేయాలని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. 25 వేల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వైసిపి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

కానవరం, కాపవరం, పల్లకడియం, బురుగుపూడి ప్రాంతాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసిన పట్టాలు నకిలీవని నిరూపించాలని భరత్ సవాల్ విసిరారు. తాము తప్పు చేసినట్లు నిరూపిస్తే అంబేద్కర్ విగ్రహం వద్ద క్షమాపణ చెబుతానని, నిరూపించలేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని ప్రశ్నించారు. పట్టాలు అధికారికంగా జారీ చేసినవేనని, లబ్ధిదారులకు స్థలాలు అప్పగించే వరకు పోరాడతామని తెలిపారు. టిడ్కో ఇళ్ల పేరుతో పట్టాలు సరెండర్ చేయించేందుకు ప్రయత్నించడం సరికాదని విమర్శించారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించి, స్థలాలు స్వాధీనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కలెక్టర్, కమిషనర్ ధ్రువీకరణతోనే పట్టాలు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారని భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బిసి జెఏసి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి, వైసిపి మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు, వైసిపి వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



## 65 కేసుల నిందితుడి ఆట కట్టింపు!

### రూ.53.51 లక్షల చోరీ సొత్తు స్వాధీనం.. అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

**రాజమహేంద్రవరం:జయ జయహే:అక్టోబర్ 12:**

అంతర్రాష్ట్ర పగటి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని ప్రకాష్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి, రూ. 53.51 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి 65 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 7న నారాయణపురంలో పోలవరపు వెంకట ధర్మరాజు ఇంట్లో జరిగిన పగటి దొంగతనంపై కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 11న రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మిక్కిలి వంశీకృష్ణ అలియాస్ శ్యాం రిచర్డ్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 410 గ్రాముల బంగారు ఆభరణాలు, 90 గ్రాముల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై రెండు రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 65 కేసులు ఉండగా, గతంలో జైలు శిక్షలు కూడా అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై సస్పెక్ట్ షీట్ ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, సెంట్రల్ జోన్ ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పాహ్వా, ఆదేశాల మేరకు ప్రకాష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.. బాజీలాల్ ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించారు. ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐలు జి. సతీష్, కె. నవీన్ కుమార్, హెచ్‌సీ నాగరాజు,కె. ప్రదీప్ కుమార్, ఎస్. వీరబాబులను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. రివార్డులు ఎస్పి తరుణ్ పహ్వా వారిచే చేతుల మీదుగా రివార్డు అందజేశారు. ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు పోలీసుల ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం 112కు తెలియజేయాలని పోలీసులు సూచించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ వివరాలకు 9493206371 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ డాక్టర్ మృతి

**బుచ్చియ్యపేట జయ జయహే**

వడ్డాది - బీ.ఎన్. రోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్ఎంపీ డాక్టర్ దుర్మరణం చెందాడు. వడ్డాది మరిడితల్లి పాదాల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో విజయరామరాజుపేటకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ దొడ్డి అమిత్ కుమార్ (43) అక్కడికక్కడే మృతి చెందాడు. అమిత్ కుమార్ ప్రతిరోజూ వడ్డాదిలో పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తుంటారు. సోమవారం ఉదయం కూడా వడ్డాదిలో పేషెంట్‌కు వైద్యం చేసి తిరిగి విజయరామరాజుపేటకు బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం కావడంతో స్పాట్ లోనే ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి నుండి బయలుదేరిన కొద్ది నిమిషాల్లోనే విషాదం జరగడంతో విజయరామరాజుపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అమిత్ కుమార్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న బుచ్చయ్యపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమిత్ కుమార్ హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం నుండి తప్పించుకునే అవకాశం ఉండేదని స్థానికులు వాపోయారు. రోడ్డు పక్కన ఎక్కడపడితే అక్కడ లారీలు ఆపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## 14న కొయ్యూరులో కూటమి మండల స్థాయి సమావేశం..

### ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.

**కొయ్యూరు,(జయ జయహే న్యూస్) అక్టోబర్ 13,**



కొయ్యూరు మండల హెడ్ క్వార్టర్ లో ఈ నెల 14వ తేదీ బుధవారం నాడు మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి హాజరుకానున్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి కూటమి పార్టీలైన తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు కూడా ఈ సమావేశానికి విచ్చేస్తున్నారు. కొయ్యూరు మండలంలో ఉన్నటువంటి కూటమి పార్టీలు తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరుతున్నాము.

## జడ్పీటీసీ నూకరాజు మృతి

### పార్టీ అండ కోసం ఎదురుచూస్తున్న కుటుంబం...

### పార్టీ భరోసాపై నాయకులు, కార్యకర్తల్లో చర్చ..

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్)అక్టోబర్ 13,**



కొయ్యూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు అకాల మరణం ఆయన కుటుంబానికి తీరని లోటుగా మారింది. ఆయన మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోగా, మరోవైపు పార్టీ తరఫున ఆ కుటుంబానికి ఎలాంటి భరోసా లభిస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పదవిలో కొనసాగుతున్న సమయంలో నూకరాజు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పార్టీ నాయకత్వం అండగా నిలుస్తుందా? కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది? అనే ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పాడేరు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడి ఆలోచన ఏ దిశగా సాగుతోంది? రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? నూకరాజు కుటుంబానికి రాజకీయంగా, సామాజికంగా భరోసా కల్పించేందుకు పార్టీ నాయకత్వం ముందుకు వస్తుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు, కొయ్యూరు మండలంలో జడ్పీటీసీ స్థానం లేదా పార్టీ నాయకత్వానికి సంబంధించి ఇతర ఆశావహులు ఎవరైనా ఉన్నారా? భవిష్యత్తులో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది? అనే విషయాలపై కూడా చర్చ జరుగుతోంది. అయితే, పార్టీ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నూకరాజు మరణంతో ఆయన కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో పార్టీ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం పనిచేసిన నాయకుడి కుటుంబానికి భరోసా కల్పించడం నాయకత్వ బాధ్యతగా భావిస్తున్న వారి అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



## రాజకీయ రంగు వద్దు.. వాస్తవాలే ముఖ్యం!

### గొడవలు పెట్టుకోవడం నా స్వభావం కాదు.. ఆధారాలతోనే మాట్లాడాలి: వాసిరెడ్డి బాబి

**రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్12:**

తనపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని టిడిపి యువ నాయకుడు వాసిరెడ్డి బాబి అన్నారు. సోమవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఇటీవల జరిగిన ఘటనపై తన వివరణఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో తన చెల్లెలు నివాసముంటున్న ఫ్లాట్‌లో గొడవ జరుగుతోందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లానని తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోకుండా తనపై రౌడీయిజం ఆరోపణలు చేయడం, రాజకీయ రంగు పులమడం తగదన్నారు. తాను గొడవలకు దూరంగా ఉంటానని, ప్రజలకు సహాయం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తన తండ్రి నేర్పిన విలువలతో ముందుకు సాగుతున్నానని, వ్యక్తుల వయస్సు, గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తానని తెలిపారు. సంబంధిత ఘటనపై నమోదైన కేసుల విషయంలోనూ వాస్తవాలు వెలుగులోకి రావాలని కోరారు. నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారానికి దూరంగా ఉండి, ఆధారాల ప్రకారమే వార్తలు ప్రచురించాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

## ఈవిఎంలపై విచారణ జరపాలి

### బ్యాలెట్ విధానాన్ని అమలు చేయాలి: ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, జయ జయహే : అక్టోబర్ 12**



ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల నిర్వహణపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్, ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా వ్యవహారాలపై విచారణ జరపాలని కోరారు. పవన్ కల్యాణ్ గెలిచినట్లు ప్రకటించిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని, 2024 ఎన్నికలకు సంబంధించిన ఆరోపణలను నిగ్గుతేల్చాలని అన్నారు. ఎన్నికల అక్రమాలపై విచారణ పూర్తయ్యే వరకు కూటమి ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ ఎన్నికపై తాను దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను త్వరగా విచారించాలని కోరారు. సమావేశానికి ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. డి.వి. రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్‌కుమార్, వల్లి శ్రీనివాసరావు, దుడ్డే త్రినాథ్, కారుమూరి యుగంధర్, గుడ్ల సాయి దుర్గాప్రసాద్, బసా సోనియా, వాడపల్లి జ్యోతిష్, జవ్వాది మోహన్, పాండ్రంగి ఈశ్వరరావు, త్రిపురాల పాండవులు, చల్లా శివదుర్గ, చల్లా వంశీ, శీతెన సురేష్, పిట్టా శ్రీనివాసరావు, పిట్టా వీరమ్మ, గరగ సురేష్, కేశన హరిన్ కార్తీక్, మట్టపర్తి తులసి, సుంకర వెంకట భాస్కర రంగారావు, డబ్బా కుమారి తదితరులు పాల్గొన్నారు.




## సమస్యాత్మక గ్రామాలను సందర్శించిన అధికారులు

**దేవరాపల్లి, అక్టోబర్ 12, జయ జయహే :**

మండలంలోని స్థానిక ఎన్నికల సమీపిస్తున్న వేళ సమస్యాత్మక గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎస్. కిరణ్ వరప్రసాద్ ఆధ్వర్యంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎస్ఐ వి.సత్యన్నారాయణ, ఎంఈఓ వి.వి. ఈశ్వరరావు అధికారుల బృందం రైవాడ, దేవరాపల్లి గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ఎన్నికల సమరానికి అన్ని ముందస్తు ఏర్పాట్లు రంగం సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. రైవాడలో వీరి వెంట పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు ఉన్నారు.

## 17న బిఎస్‌పి పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల

**అరకులోయ, అక్టోబర్ 12. జయ జయహే,**




అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థుల మొదటి జాబితాను ఈ నెల 17వ తేదీన శనివారం విడుదల చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు. బి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి బోను కృష్ణ ఆధ్వర్యంలో అరకు, పాడేరు అసెంబ్లీ కమిటీల పరిధిలోని అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఈ జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అరకు వేలి లోని గిరిజన భవనం లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బి ఎస్ పి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అరకు, పాడేరు అసెంబ్లీ కమిటీల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శెట్టి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

For a pure tomorrow.. జయహో

# స్థానిక సమరానికి సిద్ధం కండి..

## బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు.

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 13,**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, మండల అధ్యక్షుడు శివకుమార్ పిలుపునిచ్చారు. శివకుమార్ అధ్యక్షతన మండలంలోని వలసంపేటలో బీజేపీ మండల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చక్రరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఆయా స్థానాల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ గెలుపుకు గల అవకాశాలను బేరీజు వేసుకోవాలన్నారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ అధిష్టానం పిలుపుమేర అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే మండల సమావేశానికి



పదాధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, అన్ని మోర్చాల సభ్యులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు డి. పద్మరాజు, సన్యాసిరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు లీలావతి, బీసీ మోర్చా అధ్యక్షుడు గాలి దేవుడు, యువ మోర్చా అధ్యక్షుడు మణికంఠ, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు చిన్నరాజు, లక్ష్మణ్ తదితర పలువురు పాల్గొన్నారు.

# మాగ్రామాలకు రోడ్లు వేయండి!

## ఉరితాళ్ళుతో గిరిజనుల నిరసన

**మాడుగుల అక్టోబర్ 12**
**జయ జయహే**

మాడుగుల మండలం శంకరం పంచాయతీ తాడి వలస కోత్త వలస గెడ్డలపై బ్రిడ్జి నిర్మించి, రోడ్లు వేయాలని ఆరు గ్రామాలకు చెందిన ఆదివాసి గిరి జనులు తాడివలస గెడ్డ వద్ద సోమవారం మెడకు ఉ రితాళ్ళు వేసుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కెభవాని మాట్లాడుతూ, రాజంపేట,




రాయిపాలెం, తాడివలస, గోప్పూరు, వెలగలపాడు, కోత్త వలస గ్రామాలకు రోడ్లు వేయించి తాడివలస వద్ద బ్రిడ్జి నిర్మాణం చేస్తే గ్రామ సచివాలయానికి వెళ్లడానికి రావడానికి ఆరు గ్రామాలకు ఇబ్బంది లేకుండా ఉ ఒంటాదన్నారు. 11 కోట్లుతో బ్రిడ్జిలు నిర్మిస్తామని పవన్ కల్యాణ్ కు ప్రతి పాదనలు పంపించామని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఇచ్చిన హామీ నెరవేరలెదన్నారు. వర్షాలు పడినప్పుడు అత్యవసర పరిస్థితులు వస్తే సచివాలయానికి వెళ్లడానికి ఆసుపత్రికి వెళ్ళడానికి విద్యా వైద్యం చిన్న పిల్లలు ముసలి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈగెడ్డలు దాటలేక గర్బిని స్త్రీ లు గెడ్డలు వద్దనే ప్రసవం జరిగిందన్నారు మరో ఇద్దరు గిరిజనులకు వైద్య అందక మృతి చెందారన్నారు. గిరిజనులు ఇన్ని కష్టాలు పడుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టు అయిన లెదన్నారు. తక్షణమే నిధులు కేటాయించి ఈ ఆరు గ్రామాలకు రోడ్లు బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని లెదంటే భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేసారు ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.టి.దోర గిన్నెపల్లి సన్యాసమ్మ, గిన్నిపల్లి మహేష్ బాబు, సాగరి భీమరాజు, పంతాల రాజబాబు, సొలం చంద్రశేఖర్, సోలం అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం నుంచి జారిపడి

# యువకుడు మృతి

**దేవరాపల్లి, అక్టోబర్ 12, జయ జయహే :**



మండలంలోని వాలాబు పంచాయితీ శివారు కోడాపల్లిలో జరుగుతున్న విద్యుత్తు పనుల్లో దుచ్చరి హరిబాబు (24) అనే గిరిజన యువకుడు విద్యుత్తు స్తంభం పై నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన విషయంపై స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం పెదమాకవరం పంచాయితీ శివారు గానుగుల గ్రామానికి చెందిన మృతుడు అన్నయ్య దుచ్చరి పవన్ మూర్తి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించగా 24 గంటల విద్యుత్తు లైన్ పనులు వాలాబు పంచాయతీలో కాంట్రాక్టర్ మాకిరెడ్డి నగేష్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కోడాపల్లిలో పని ముగించే సమయానికి మృతుడు హరిబాబు విద్యుత్తు స్తంభం పై నుంచి జారి పడిన వెంటనే కె. కోటపాడు సిహెచ్ కి తరలించగా హరిబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతి దేహాన్ని పోస్టుమార్టంకు తరలించడం జరిగిందన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి కుటుంబ సభ్యులకు ఎటువంటి అనుమానాలు లేవని స్పష్టం చేసినట్లు ఎస్ఐ సత్యన్నారాయణ తెలిపారు.

## వివాదానికి

# మసిపూయొద్దు!

## నాపై దుష్ప్రచారం ఆపాలి: టిడిపి యువ నాయకుడు వాసిరెడ్డి బాబి

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 12**



వ్యక్తిగత వివాదానికి రాజకీయ రంగు పులమడం తగదని, తనపై నిరాధార ఆరోపణలతో దుష్ప్రచారం చేయడం ఆపాలని టిడిపి యువ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు కుమారుడు వాసిరెడ్డి బాబి కోరారు. సోమవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఇటీవల జరిగిన ఘటనపై వివరణ ఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో తన చెల్లెలు నివాసముంటున్న ఫ్లాట్‌లో గొడవ జరుగుతోందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లానని తెలిపారు. వెంకట రామదాసు తన పట్ల తొలుత దురుసుగా వ్యవహరించారని, ఆయన మాజీమంత్రి చేగొండి హరిరామజోగయ్య కుమారుడని తనకు తెలియదని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తనకు రౌడీయిజం, భూకబ్జాలు, ఇసుక మాఫీతో సంబంధాలున్నాయంటూ ప్రచారం చేయడాన్ని ఖండించారు. గొడవలు పెట్టుకోవడం తన స్వభావం కాదని, ప్రజలకు సహాయం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తన తండ్రి నేర్పిన విలువలతో ముందుకు సాగుతున్నానని, ఘటనపై వాస్తవాల ఆధారంగా వార్తలు ప్రచురించాలని బాబి కోరారు.

# స్టాఫ్ నర్స్ రిక్రూట్మెంట్ బిల్లులు గోల్ మాల్

## నిధులు మంజురైనా ఖర్చు చేసిన తనకు రూపాయి కూడా రాలేదని గగ్గోలు

## రూ.6 లక్షల బిల్లుల కోసం 4 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగి

## రికార్డులు , బిల్లులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్న బాధితుడు గోరు సూర్యనారాయణ

**విశాఖపట్నం జయజయహే**

వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) కార్యాలయంలో నర్సింగ్ ఎంఎల్ హెచ్పి నియామకాల సమయంలో చేసిన ఖర్చుల బిల్లులు మంజూరు చేయకుండా అధికారులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ గోరు సూర్యనారాయణ వాపోతున్నారు . అయన తెలిపిన వివరాల ప్రకారం 2020 లో నియామక ప్రక్రియ చేపట్టారని తెలిపారు . నిర్వహణ ఖర్చులను భరించాలని బిల్లులు వచ్చాక ఇస్తామని అప్పటి అర్డి స్వరాజ్యలక్ష్మి ఆదేశించినట్లు తెలిపారు . చేయలేనని చెప్పిన ఒత్తిడి చేసి మరీ ఖర్చు పెట్టిన్చినట్లు తెలిపారు . ఆఫీసు అవసరాలు, టిఫిన్లు, స్నాక్స్, సిబ్బంది భోజనాలు, విజయవాడ కమిషనరేట్‌కు ఫైళ్లు తీసుకెళ్లడం, కార్ల ఖర్చులు వంటి వాటి కోసం సుమారు రూ. 6, లక్షల రూపాయలు ఖర్చు చేయించారని ఆరోపించారు. ఈ సొమ్మును తిరిగి ఇప్పిస్తామని నమ్మించి నట్టేట ముంచారని వాపోయారు . అదిగో ఇదిగో అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ తీవ్ర మనో వేదనకు గురిచేస్తున్నారని చింతించారు . అధికారులు తనకు న్యాయం చేయాలనీ రికార్డులు పరిశీలించి నిజమెంటో తేల్చాలని కోరుతున్నారు .

**తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో బాధితుడు:**

ఉద్యోగంలో ఇబ్బందులు పెట్టి, బదిలీలు చేస్తూ, సస్పెండ్ చేస్తామని భయపెట్టడంతో అప్పులు చేసి ఖర్చులు పెట్టాల్సి వచ్చిందని బాధితుడు



తెలిపారు. అప్పుల వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడంతో, కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చి ఇంటి స్థలం (133 గజాలు), వ్యవసాయ భూమి (0.35 సెంట్లు)ని విల్లునామా ద్వారా రాయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫైళ్లు గాయబ్.. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం:**

బిల్లుల రికవరీ కోసం గత ఐదారు నెలలుగా ఆర్‌డీ కార్యాలయం, కలెక్టర్ గ్రీవెన్స్‌లకు చుట్టూ తిరుగుతున్నప్పటికీ.. "ఫైల్ పోయింది" అని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఎంతమందిని కలిసినా పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి సరైన స్పందన రాలేదని తెలిపారు.

**న్యాయం చేయాలని వేడుకోలు:**

అధికారులు నాటి ఆర్‌డీ బ్యాంక్ ఖాతాలు, స్టేట్‌మెంట్‌లు పరిశీలించి విచారణ జరిపించాలని, తనకు రావాల్సిన రూ. 6.లక్షల సొమ్మును తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.




## ఈనెల 23వ తేదీ నుంచి

# ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన

**విజయనగరం (జయ జయహే)**

విజయనగరం జోన్లో ఉండేటటువంటి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో, విజయనగరం జోన్ యాజమాన్యం, నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తు, గత నాలుగు నెలల కిందట ఇచ్చినటువంటి మినిట్స్ ను అమలుపరచకుండా, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా, ఏకపక్ష నిర్ణయాలు చేపడుతున్నందున, ఈనెల 23వ తేదీ నుండి 19 బస్ డిపొల వద్ద విజయనగరం జోన్ మొత్తం ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంప్లాయిస్ యూనియన్ గా నిర్ణయించుట, జరిగినది. విజయనగరం స్థానిక ఎన్జీవో భవన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు జోన్ ఇన్చార్జి, పి భానుమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్చార్జి, పి భానుమూర్తి, జోనల్ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, జోనల్ సెక్రెటరీ భాసూరి కృష్ణమూర్తి, జోనల్ కోశాధికారి కె ఎస్ ఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.




## వీఎంఆర్డీఏ ప్రజాదర్బార్‌లో

# వినతులు స్వీకరణ

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాదర్బార్‌లో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొని అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వినతులను నిశితంగా పరిశీలన చేసి, శాఖాపరంగా సత్వరమే పరిష్కారమార్గం చూపాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు మూడువినతులు రాగా, వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 2, ఎస్టేట్ విభాగానికి సంబంధించి 1 చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో ఒ.ఎస్.డి. కృష్ణనాయక్, అదనపు కార్యదర్శి రుషిబాబు, ప్లానింగ్ అధికారులు, సంబంధిత విభాగాల పరిపాలనాధికారులు పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చిన వినతులకు పరిష్కారానికి సంబంధించి జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు.



## సాక్షాత్ జగన్మాత స్వరూపాలు

# చిన్నారి బాలికలు

## 125 మంది చిన్నారులతో

## పాదపూజ మహోత్సవం

**భీమవరం ; (జయ జయహే)**

సృష్టికి మూలమైన పరాశక్తిని వివిధ రూపాల్లో ఆరాధించే మన సంప్రదాయంలో చిన్నారి బాలికలను సాక్షాత్ జగన్మాత స్వరూపాలుగా భావించి పూజిస్తారని భీమవరం లో శంభో ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురూజీ శ్రీజీ గ అన్నారు. భీమవరం ఆనంద పంక్షన్ హాల్లో దసరా శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బాలా త్రిపురసుందరి దేవీ అవతారం రోజున బాలికల పాదపూజ మహోత్సవాన్ని భీమవరం శంభో స్పిరిచువల్ క్లబ్ మరియు ఆనంద ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించారు. 125 మంది బాలికలు పాదపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీజి గురూజీ మాట్లాడుతూ బాలికా పూజ (కుమారి పూజ) కేవలం ఒక మతపరమైన ఆచారంతోపాటు సమాజంలో ఆడపిల్లల పట్ల ఉండవలసిన అత్యున్నత గౌరవానికి నైతికతకు ప్రతీక అని అన్నారు. హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం రుతుమతి కాని బాలికలు ఎలాంటి పాపాలు, కల్మషాలు ఎరుగని స్వచ్ఛమైన మనసును కలిగి ఉంటారని, అందుకే వారిని దైవిక శక్తికి ప్రతిరూపాలుగా భావిస్తారని అన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలోతటవర్తి కిరణ్, గూడూరు బాలమురళి, మానేపల్లి వెంకన్న బాబు, ప్రొఫెసర్ గోపీ, గమిని పవన్, సలాది ప్రకాష్, నడింపల్లి మహేష్, అద్దంకి శివ, పత్రిపాటి శ్రీనివాస్, బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, మానేపల్లి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధిద్దాం

# పవన్‌కి బహుమతిగా అందిద్దాం

### రోలుగుంటను అభివృద్ధి చేసుకుందాం

**చోడవరం అక్టోబర్ 12 జయ జయహే**

రానున్న స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు రోలుగుంట మండలాన్ని బహుమతిగా అందిద్దామని తద్వారా ఈ మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారంచోడవరం నియోజకవర్గ పరిధిలో గల రోలుగుంట మండలంలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు రోలుగుంట గ్రామంలో భారీ కవాతు నిర్వహించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, జనసేన పార్టీ నాయకత్వం ప్రజాసేవకు, ముఖ్యంగా ప్రాంత అభివృద్ధికి అంకితమైందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా రోలుగుంట మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తల బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చామని, నేడు మండలంలో జనసేన పార్టీ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి, పవన్ కళ్యాణ్ నాయకత్వం, భరోసాతో రోలుగుంట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.పవన్ సారథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయని, అమరజీవి పొట్టి శ్రీరాములు జలధార కార్యక్రమం కింద



చోడవరం నియోజకవర్గానికి రూ.502 కోట్లు మంజూరు కావడం మన ప్రాంతానికి ఎంతో శుభపరిణామమని అన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కి, కూటమి ప్రభుత్వానికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.రోలుగుంట మండలంలో తాగునీరు, ఉపాధి, విద్య తదితర రంగాలకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పీవీఎస్ఎన్ రాజు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఒకప్పుడు చిన్న పార్టీగా ప్రారంభమైన జనసేన పార్టీ నేడు రోలుగుంట మండలంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగడానికి పవన్ కళ్యాణ్ గారి ఆదర్శాలు, సిద్ధాంతాలతోపాటు పీవీఎస్ఎన్ రాజు చేస్తున్న నిరంతర కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు.నాయకులకు, కార్యకర్తలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ, నాయకుడిగా కాకుండా ఒక సేవకుడిగా వారితో కలిసి పనిచేస్తూ, పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజల మనసులను పీవీఎస్ఎన్ రాజు గెలుచుకున్నారని ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని, జనసేన పార్టీని మరింత పటిష్ఠం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గండి సింహాద్రి, మండల పార్టీ అధ్యక్షులు బలిజ మహారాజు, అల్లు సత్యనారాయణ, హిటెన్సర్ జగన్, వీర మహిళా అధ్యక్షురాలు అనిమిరెడ్డి మహేశ్వరి, ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ లాలం నరసింగరావు, సీనియర్ నాయకులు గండి తాతాజీ, పెద్దాడ నాగేశ్వరరావు, కేసరిపూడి శివాజీ, దుంగల బుచ్చిరాజు, దేవాడ రమణ, ద్వారపురెడ్డి రామకృష్ణ, అరిపిత్రినాద్, బెజవాడ వాసు, అవుగడ్డ మహేష్, జగ్గు నాయుడు, ఇటంశెట్టి ఈశ్వరరావు, మలసాల శ్రీనివాసరావు, వజ్రపు రమేష్, బలిజి సన్యాసిరావు, బంటు నాయుడు, లగుడు లోవరాజు తదితర నాయకులతోపాటు పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



## గాయత్రి దేవి అలంకరణలో దుర్గాలమ్మ

**మాడుగుల అక్టోబర్ 12 జయ జయహే**

దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం మాడుగుల జిసిసి వద్ద బెన్ చేసి యున్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జరుగుబిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చక బృందం హోమాది కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బస్టాండ్ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో కూడా సోమవారం అర్చకులు శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు నిర్వహించారు. నవర వీధిలో గల శ్రీ పోలిపిళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో కూడా రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

**చోడవరం అక్టోబర్ 12 జయ జయహే**

చోడవరం మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీటీసీ,ఎంపీటీసీ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎంపీడీవో , డిప్యూటీ తహశీల్దార్ తో కలిసి చోడవరం సీఐ అప్పలరాజు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ఎన్నికల సిబ్బందికి కల్పించాల్సిన సదుపాయాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు.

జడ్పీటీసీ,ఎంపీటీసీ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## శ్రీజ్ఞానప్రసూనాంబికా అమ్మవారికి బంగారు గాజుల విరాళం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీజ్ఞానప్రసూనాంబికా దేవి అమ్మవారికి భక్తురాలు ప్రమీలా బాయి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బంగారు గాజులను భక్తిశ్రద్ధలతో విరాళంగా అందజేశారు. సుమారు రూ.3.73 లక్షల విలువైన బంగారు గాజులను ఆలయ అధికారులకు అందించారు.ఈ విరాళాన్ని ఆలయ అధికారులు, వేదపండితులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమెకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం అందించారు. స్వామివారి, అమ్మవారి జ్ఞాపికతో పాటు తీర్థప్రసాదాలను దాతకు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రోటోకాల్ ఏఈవో లోకేష్ బాబు, ఏఐవో హేమమాలిని, దాతల విభాగం ఇన్‌ఛార్జి ఎం. నాగయ్య, అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## పేదలపై దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదు!

### బాధితులకు న్యాయం చేయకుంటే మహాధర్నా: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**రేణిగుంట, అక్టోబర్, 12, జయ జయహే**

రేణిగుంట మండలం కరకంబాడి రెవెన్యూ పరిధిలోని రామకృష్ణాపురంలో నిరుపేద కుటుంబాల ఇళ్ల కూల్చివేత ఘటనను శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేయడం, దివ్యాంగులు, మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడటం అమానవీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ నాయకుడు ముని కృష్ణ వ్యక్తిగత కక్షలతో పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని పేదలకు అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ఘటనపై జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఆర్డీవో స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, గంగారి రమేష్, దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నగేష్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 36 వినతులు

**విశాఖపట్నం, అక్టోబర్ 12, జయ జయహే**

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 36 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా లో-వోల్టేజ్, విద్యుత్ బిల్లులు, లైన్ షిఫ్టింగ్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన ఫిర్యాదులు మరియు వినతులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా 9493681912 వాట్సాప్ నంబర్‌కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం పి.సోల్మన్ రాజు, జనరల్ మేనేజర్లు ఎం.ఝాన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్, బి. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు

### గ్రీవెన్స్ డేలో వినతిపత్రం అందజేత

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 12, జయ జయహే**



శ్రీకాళహస్తి తమ కుటుంబానికి చెందిన భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామానికి చెందిన అర్ధమాల వెంకటాద్రి సోమవారం గ్రీవెన్స్ డేలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాద్రి మాట్లాడుతూ సర్వే నంబరు 193/1లో ఉన్న 1.50 ఎకరాల ప్రభుత్వ భూమి తమ కుటుంబానికి తరతరాలుగా వస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఆ భూమి ఇతరుల ఆక్రమణకు గురైందని, సంబంధిత అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.వినతిపత్రంపై స్పందించిన ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి గ్రామంలో సభ నిర్వహించి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



### అగనంపూడి గంభీరంలోనే

## భారీ వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష

### డీటీసీకి కోరిన టీఎన్ టీయూసీ నాయకులు

**విశాఖపట్నం, అక్టోబర్ 12, (జయ జయహే):**

విశాఖపట్నం జిల్లాలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఏర్పాటు చేసే వరకు అగనంపూడి గంభీరంలోనే పాత విధానంలో భారీ వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని టీ.ఎన్.టి.యు.సీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ పార్లమెంటరీ టీ.ఎన్.టి.యు.సీ అధికార ప్రతినిధి, జిల్లా ఆర్టీఐ, మానవ హక్కుల డిప్యూటీ కార్యదర్శి సఖనాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విశాఖపట్నంలో పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలు అధికంగా ఉండటంతో కార్లు, భారీ వాహనాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా శాఖ సంయుక్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను ప్రవేశపెట్టాయని తెలిపారు.విశాఖపట్నం జిల్లాలో అగనంపూడి గంభీరంలో ఏటీఎస్ ఏర్పాటు చేయకుండా, అనకాపల్లి జిల్లా సబ్బవరంలో ఏర్పాటు చేయడంతో భారీ వాహనాల యజమానులు అక్కడికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతంలోనూ ఇదే సమస్య తలెత్తినప్పుడు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శితో మాట్లాడి విశాఖ జిల్లాలోనే పాత విధానంలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేలా కృషి చేశారని గుర్తుచేశారు.ప్రస్తుతం మళ్లీ సబ్బవరం ఏటీఎస్‌కు వెళ్లాలని ఆర్టీఓ అధికారులు సూచిస్తున్నారని, దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విశాఖ జిల్లాలో ఏటీఎస్ ఏర్పాటు చేసే వరకు అగనంపూడి గంభీరంలోనే పాత విధానంలో ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగించాలని కోరారు. దీనిపై డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు స్పందిస్తూ, ప్రస్తుతం అగనంపూడి గంభీరంలో ఆటోలు, ట్రాక్టర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారీ వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం సబ్బవరం ఏటీఎస్‌కు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. టీ.ఎన్.టి.యు.సీ నాయకులు అందజేసిన వినతిని రాష్ట్ర రవాణా కమిషనర్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు.

For a pure tomorrow.. జయహే

# పాపను చంపేసి.. ప్రాణానికి ధర కట్టాడు!

(హెచ్. ప్రతాప్)

**ఇంటికి తిరిగిరావాల్సిన ఐదేళ్ల పాప కనిపించలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగానే ఫోన్ మోగింది. చిన్నారి తన వద్ద ఉందని, రూ.20 లక్షలు ఇవ్వాలని అవతలి వ్యక్తి డిమాండ్ చేశాడు. పాపను క్షేమంగా చూడాలన్న ఆశతో కుటుంబం ఆ కాల్స్‌కు స్పందిస్తుండగా, అదే నివాస సముదాయంలోని నీటి సంపులో ఆమె మృతదేహం బయటపడింది. హైదరాబాద్‌లోని బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధి కౌకూర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.**



పోలీసుల వివరాలను ఉటంకిస్తూ వెలువడిన మీడియా కథనాల ప్రకారం, విల్లా ఆర్కిడ్స్‌లో నివసించే పరిశోధకుడు మిల్టన్ ఫెర్నాండెస్ మోసెస్ కుమార్తె ఆరేలియా అక్టోబర్ 10 సాయంత్రం క్లబ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను చూసేందుకు వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. ఇంతలో చిన్నారి తాతకు గుర్తుతెలియని నంబరు నుంచి కాల్ వచ్చింది. తొలుత మనవడు తన ఆధీనంలో ఉన్నాడని చెప్పిన వ్యక్తి, బాలుడు క్షేమంగానే ఉన్నాడని తెలియడంతో కాల్ నిలిపివేశాడు. అనంతరం చిన్నారి తండ్రికి ఫోన్ చేసి కుమార్తెను అపహరించినట్లు చెప్పాడు.




వరుస కాల్స్‌తో ఆందోళన చెందిన కుటుంబం క్లబ్‌హౌస్ పరిసరాలను పరిశీలించింది. పాప ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. డబ్బు పంపేందుకు సిద్ధమైనప్పటికీ, ముందుగా చిన్నారిని వీడియోకాల్‌లో చూపించాలని కుటుంబ సభ్యులు కోరారు. కాల్ చేసిన వ్యక్తి అందుకు నిరాకరించాడు. అనంతరం ఫోన్ స్విచాఫ్ కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి.

దర్యాప్తులో సీసీటీవీ దృశ్యాలు, విమోచన డిమాండ్ వచ్చిన ఫోన్ నంబరు కీలకంగా మారాయి. చిన్నారి క్లబ్‌హౌస్ నుంచి బయటకు వస్తుండగా ఒక వ్యక్తి వెనుక అను-సరిస్తున్నట్లు దృశ్యాల్లో కనిపించింది. కాల్స్‌కు ఉపయోగించిన నంబరు అక్కడ పనిచేస్తున్న మరో భద్రతా సిబ్బందికి చెందినదిగా గుర్తించారు. అతన్ని ప్రశ్నించగా, మాజీ గార్డు విక్రమ్ తన ఫోన్‌ను ఉపయోగించినట్లు చెప్పాడని పోలీసులు వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా క్లబ్‌హౌస్ సెల్లార్‌లో వెతకగా నీటి సంపులో చిన్నారి మృతదేహం లభించింది.

ఈ కేసులో అనుమానితుడి అరెస్టుపై వార్తా కథనాల్లో భిన్న సమాచారం ఉంది. విక్రమ్‌ను సనత్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఒక పత్రిక పేర్కొనగా, అక్టోబర్ 12 ఉదయం నవీకరించిన మరో కథనం అతని కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపింది. అందువల్ల అధికారిక నిర్ధారణ లేకుండా అరెస్టయినట్లు చెప్పలేం. నివాస సముదాయంలోని ఏడుగురు భద్రతా సిబ్బందిని పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు తాజా కథనం వెల్లడించింది.

చిన్నారి మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. బంధువులు, ఇరుగుపొరుగువారు కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పాప తిరిగివస్తుందన్న ఆశతో మొదలైన ఆ రాత్రి, ఆమె మృతదేహం లభించడంతో తీరని విషాదంగా ముగిసింది.

# భూలోక వైకుంఠంలో బ్రహ్మోత్సవ శోభ

(సి.హెచ్. ప్రతాప్)

**ఏడుకొండలపై ప్రతిధ్వనించే గోవింద నామస్మరణ.. వేదమంత్రాల మధ్య పరవశించే భక్తజనం.. మంగళవాద్యాల నడుమ దివ్యవాహనాలపై ఊరేగే శ్రీనివాసుడు.. పుష్పాలంకరణలతో శోభిల్లే తిరుమాడవీధులు! భూలోక వైకుంఠమైన తిరుమలలో కనిపించే ఈ అపూర్వ ఆధ్యాత్మిక వైభవమే శ్రీవారి బ్రహ్మోత్సవం. ఇది కేవలం తొమ్మిది రోజుల ఉత్సవం కాదు. భక్తికి పరాకాష్ఠ, విశ్వాసానికి ప్రతిరూపం, భారతీయ సనాతన సంస్కృతికి సజీవ సాక్ష్యం. భగవంతుడికి, భక్తుడికి మధ్య అవధులు చెరిగిపోయే మహోన్నత సందర్భం.**




సృష్టికర్త బ్రహ్మదేవుడు లోకకల్యాణార్థం శ్రీనివాసుడికి తొలిసారిగా నిర్వహించిన ఉత్సవాలే బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి చెందాయని పురాణ సంప్రదాయం తెలియజేస్తోంది. ఈ ఏడాది తిరుమలలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఇప్పటికే ముగియగా, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.



అక్టోబర్ 11న అంకురార్పణతో వేడుకలకు శ్రీకారం చుడతారు. విశ్వక్సేనులవారి ఊరేగింపు, మేదినీపూజ, బీజావాపనం ఈ కార్యక్రమంలో ప్రధాన ఘట్టాలు. నవధాన్యాల బీజావాపనం శుభారంభానికి, సృష్టి వికాసానికి సంకేతం. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకపోవడం విశేషం.

అక్టోబర్ 12న బంగారు తిరుచ్చి, పెద్దశేష వాహనాలతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 13న చిన్నశేష, హంస వాహనాలతో కొనసాగుతాయి. 14న సింహ, ముత్యపుపందిరి వాహనాలు, 15న కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలు భక్తులకు కనువిందు చేస్తాయి. 16న మోహినీ అవతారం, అత్యంత విశిష్టమైన గరుడసేవ నిర్వహిస్తారు. 17న హనుమంత, పుష్పకవిమానం, గజ వాహనాలు, 18న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలు, 19న స్వర్ణరథం, అశ్వ వాహనసేవలు జరుగుతాయి. అక్టోబర్ 20న చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

ప్రతి వాహనసేవ వెనుక ఒక గొప్ప ఆధ్యాత్మిక సందేశం దాగి ఉంది. హంస వివేకానికి, సింహం ధైర్యానికి, గరుడుడు సంపూర్ణ శరణాగతికి, హనుమంతుడు నిస్వార్థ భక్తికి ప్రతీకలు. సూర్యచంద్రప్రభ వాహనాలు సమస్త సృష్టికి పరమాత్మే ఆధారమనే తత్త్వాన్ని చాటుతాయి. ఈ వాహనసేవలు కేవలం కనువిందు చేసే దృశ్యాలు కావు. మనిషి తన జీవన విధానాన్ని ఉన్నతంగా మలచుకోవడానికి మార్గదర్శకాలు. 'వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన' అనే శ్లోకవాక్యం తిరుమల క్షేత్ర విశిష్టతను చాటుతుంది. స్వామివారి సన్నిధిలో ధనికుడు, పేదవాడు, పండితుడు, పామరుడు అనే భేదాలు లేవు. అందరి పెదవులపై ఒకే నామం.. అందరి హృదయాల్లో ఒకే విశ్వాసం.. అందరి ఆకాంక్ష ఒక్కటే.. గోవిందుని అనుగ్రహం!బ్రహ్మోత్సవాల పరమార్థం కేవలం దివ్యవాహనాలను దర్శించడంలోనే లేదు. అహంకారాన్ని విడిచిపెట్టడం, మనసును పవిత్రం చేసుకోవడం, తోటి ప్రాణుల పట్ల కరుణ చూపడం, నిస్వార్థ సేవను ఆచరించడంలో ఉంది. భక్తి మనిషిని మంచివాడిగా మార్చినప్పుడే ఆరాధనకు నిజమైన సార్థకత.తిరుమలలో తొమ్మిది రోజులపాటు జరిగేది స్వామివారి బ్రహ్మోత్సవం. ఆ ఉత్సవ స్ఫూర్తితో మన హృదయాల్లో వెలగవలసింది జీవితాంతం ఆరని భక్తిజ్యోతి. భగవంతుడిని దర్శించడం అదృష్టం.. ఆయన బోధించే ధర్మాన్ని ఆచరించడమే నిజమైన భక్తి!



# వార్డుల పునర్విభజనలో అశాస్త్రీయ విధానం!

## భౌగోళిక పరిస్థితులను పట్టించుకోలేదు

## మున్సిపల్ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి

**శ్రీకాళహస్తి , అక్టోబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని 35 వార్డులను 44 వార్డులుగా పెంచుతూ చేపట్టిన పునర్విభజనలో భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా వార్డులను విభజించారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. వార్డుల పునర్విభజనలోని లోపాలను సరిదిద్దాలని కోరుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు నేతృత్వంలో మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మొదటి వార్డు పరిధిలోని వి.మం.పల్లి, కేమంపల్లి, జైహింద్‌పురం ప్రాంతాల్లో సుమారు 1,694 ఓట్లు ఉన్నాయని తెలిపారు. నిర్దేశిత ఓటర్ల పరిమితి సుమారు 1,650 కాగా, అదనపు ఓటర్లను సమీపంలోని రెండో వార్డులో కలపకుండా, దూరంగా ఉన్న 42వ వార్డులోని బి.పి. అగ్రహారంలో చేర్చడం సమంజసం కాదన్నారు.అలాగే కొండ అవతల ఉన్న కైలాసగిరి కాలనీని తుఫాన్ సెంటర్‌తో అనుసంధానం చేయడం, మద్రాసు రోడ్డులోని తంగిడిపాలెంను పిచ్చాటూరు రోడ్డులోని రాజీవ్‌నగర్‌తో కలిపి ఒకే వార్డుగా ఏర్పాటు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోకుండా వార్డుల విభజన చేపట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.స్థానిక ప్రజలు, నాయకులు లేవనెత్తిన అభ్యంతరాలను ఇప్పటికే లిఖితపూర్వకంగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వాటిని పరిశీలించి వార్డుల పునర్విభజనను పునఃపరిశీలించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా న్యాయబద్ధంగా వార్డుల విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కాట ముత్తు, మహబూబ్ బాషా, కంట ఉదయ్ కుమార్, పసల సుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర రాజు, శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, ముని కృష్ణారెడ్డి,గోర తదితరులు పాల్గొన్నారు.



# దళితుల శ్మశాన వాటిక భూమి ఆక్రమణ?

## చెట్లు, దిబ్బలు తొలగించి పొలంలో కలిపేశారని గ్రామస్తుల ఆవేదన

**తొట్టంబేడు, అక్టోబర్ 12, జయ జయహే**

తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో దళితుల శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్లు 127, 128లో ఉన్న సుమారు 1.50 ఎకరాల భూమిని గ్రామంలోని 60 దళిత కుటుంబాలు తరతరాలుగా శ్మశాన వాటికగా వినియోగిస్తున్నాయని తెలిపారు.శ్మశాన వాటిక భూమిని ఆనుకుని ఉన్న ఓ రైతు క్రమంగా ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ క్రమంలో సోమవారం శ్మశాన స్థలంలోని చెట్లు, దిబ్బలను తొలగించి భూమిని చదును చేసి తన పొలంలో కలిపేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా శ్మశాన వాటికగా వినియోగిస్తున్న భూమిని ఆక్రమిస్తే తమకు అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శ్మశాన వాటిక భూమిని పరిశీలించి, ఆక్రమణ జరిగితే తొలగించి భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం తొట్టంబేడు తహశీల్దార్ భారతిని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.




# పూడి గిరిజనులకు న్యాయం చేయాలి

## భూములు స్వాధీనం చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి పూర్వీకుల నుంచి వారసత్వంగా సాగు చేసుకుంటున్న భూములను తమకు స్వాధీనం చేసి, పూడి గిరిజనులకు న్యాయం చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పూడి గిరిజనులు సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు హరినాథ్ ముఖ్య అతిథిగా హాజరై మద్దతు తెలిపారు. కేవీపీఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ పూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 143 నుంచి 150 వరకు ఉన్న 2.79 ఎకరాల భూములను గిరిజనులు తమ పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు అగ్రకులస్తులు ఆ భూముల్లోకి గిరిజనులను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎదిరిస్తే దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టగా, స్పందించిన ఆర్డీవో గిరిజనులకు భూములు స్వాధీనం చేయాలని తొట్టంబేడు తహశీల్దార్‌ను ఆదేశించినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు భూములను స్వాధీనం చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హరినాథ్ హెచ్చరించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com

# జీవీఎంసీ ఎన్నికల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం





### పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు

### వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు

**విశాఖపట్నం అక్టోబర్ 12, (జయ జయహే):**

రాబోయే గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల్లో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ ముందుకు సాగుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామని స్పష్టం చేశారు.విశాఖలోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నాయి బ్రాహ్మణ, శెట్టి బలిజ సంఘాల ప్రతినిధులతో పాటు జీవీఎంసీ ఎన్నికల్లో వివిధ వార్డుల నుంచి పార్టీ తరఫున పోటీ చేయాలని ఆశిస్తున్న నాయకులు కె.కె. రాజును కలిసి తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులు**

అనంతరం రాష్ట్ర, జిల్లా పార్టీ కమిటీలకు చెందిన పలువురు నాయకులకు కె.కె. రాజు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. కమిటీల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులకు అధికారిక గుర్తింపు కల్పించడంతో పాటు, పార్టీ కార్యక్రమాల్లో వారి పాత్రను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. మిగిలిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు విడతల వారీగా గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్, దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, సీఈసీ సభ్యుడు కోలా గురువులు, పార్టీ నాయకులు కట్టుమూరి సతీష్, బాణా శ్రీనివాసరావు, రేయ్యి వెంకటరమణ, పీలా వెంకటలక్ష్మి, అనిల్ కుమార్ రాజు, పి.వి. సురేష్, చెన్న జానకిరామ్, ఊరుకోటి రామచంద్రరావు, మహమ్మద్ ఇమ్రాన్, బర్కత్ అలీ, బల్లా లక్ష్మణ్, గుండపు నాగేశ్వరరావు, ప్రసాద్ రాజు, శ్రీదేవి వర్మ, కృపా, ప్రేమ్ కిరణ్, ఉమామహేష్, రాజబాబు, మార్కండేయులు, మనోజ్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైల్వే తాగునీటి భద్రతకు పెద్దపీట

### 78 స్టేషన్లలో 2,419 నమూనాల పరీక్ష..

### క్లోరిన్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత

**విశాఖపట్నం, అక్టోబర్ 12, (జయ జయహే):**

రైలు ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులు, నివాసితులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా దక్షిణ కోస్తా రైల్వే విస్తృత స్థాయిలో నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించింది. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రైల్వే వైద్య విభాగం ఆధ్వర్యంలో నాలుగు డివిజన్ల పరిధిలో ఈ ప్రత్యేక తనిఖీలను చేపట్టింది. రైల్వే స్టేషన్లు, నివాస కాలనీలు, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, శిక్షణా సంస్థలు, పాఠశాలలు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయాలు, వర్క్‌షాప్‌లలో తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షించారు.

**స్టేషన్లలో విస్తృత పరీక్షలు**

78 రైల్వే స్టేషన్ల పరిధిలో రెసిడ్యువల్ క్లోరిన్ స్థాయిని నిర్ధారించేందుకు 2,419 నమూనాలను పరీక్షించగా, అన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు వెల్లడైంది. 71 స్టేషన్లలో నిర్వహించిన బ్యాక్టీరియాలజీ పరీక్షల్లో 200 నమూనాలను విశ్లేషించగా, 187 నమూనాలు ప్రమాణాలకు



అనుగుణంగా ఉన్నాయి. మరో 13 నమూనాల ఫలితాలు రావాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రమాణాలకు విరుద్ధమైన నమూనాలు ఏవీ గుర్తించలేదు.

అలాగే, 16 స్టేషన్ల నుంచి సేకరించిన 16 రసాయన పరీక్ష నమూనాల్లో ఐదు మాత్రమే ఇప్పటివరకు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారణ కాగా, మిగిలిన 11 నమూనాల ఫలితాలు వెల్లడికావాల్సి ఉంది.

**రైల్వే కాలనీల్లోనూ భద్రతా తనిఖీలు**

రైల్వే కాలనీలు, పరిపాలనా కార్యాలయాలు, వైద్య విభాగాలకు చెందిన 35 ప్రాంతాల్లో సేకరించిన 754 తాగునీటి నమూనాలు క్లోరిన్ పరీక్షల్లో నిర్దేశిత ప్రమాణాలను అందుకున్నాయి. అదేవిధంగా, 29 ప్రాంతాల నుంచి సేకరించిన 66 బ్యాక్టీరియాలజీ నమూనాలు, రెండు ప్రాంతాల నుంచి సేకరించిన రెండు రసాయన పరీక్ష నమూనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**నిబంధనల అమలుపై ప్రత్యేక నిఘా**

భారతీయ రైల్వే వైద్య నియమావళి ప్రకారం తాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సురక్షిత తాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ కోస్తా రైల్వే వెల్లడించింది.

# ఆమె ఎప్పటికీ చిరంజీవినే!

### ఐడియల్ కళాశాలలో డాక్టర్ చిరంజీవిని కుమారి విగ్రహావిష్కరణ

### ఆమె సేవలను కొనియాడిన పద్మశ్రీ గరికపాటి

**కాకినాడ, అక్టోబర్ 12 (జయ జయహే):**



భౌతికంగా మన మధ్య లేకపోయినా, తన సేవలు, ఆశయాలు, ఆదర్శాలతో డాక్టర్ చిరంజీవిని కుమారి ఎప్పటికీ చిరంజీవిగానే నిలిచిపోతారని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కళాశాలలో సోమవారం నిర్వహించిన డాక్టర్ చిరంజీవిని కుమారి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ శాసనసభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, సుమారు 50 ఏళ్ల క్రితం కాకినాడలో సదుద్దేశంతో ఐడియల్ కళాశాలను స్థాపించారని గుర్తుచేశారు. అప్పట్లో తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో కళాశాలకు అనుమతి లభించిన విషయాన్ని ప్రస్తావించారు. డాక్టర్ చిరంజీవిని కుమారి ఆశయాలను కొనసాగిస్తూ కళాశాల యాజమాన్యం ముందుకు సాగాలని సూచించారు. గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ, కాకినాడతో పాటు చిరంజీవిని కుమారితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఆమె ఏ పనినైనా ఎంతో చాకచక్యంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసేవారని కొనియాడారు. కళాశాలలో తెలుగు భాషకు ప్రాధాన్యం కల్పించడంలో ఆమె పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ, ఐడియల్ కళాశాల విద్యార్థుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె ఆలోచనలు, సేవలు విద్యార్థుల మనస్సుల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు.అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులతో పాటు విగ్రహ రూపశిల్పి రాజ్‌కుమార్ వడయార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, బొర్రా గోపీమూర్తి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పర్చూరు కృష్ణారావు, చిరంజీవిని కుమారి కుమారులు గోపాల్, కిరణ్, కళాశాల ఏవో జీవీకే వర్మ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాకుమాను రాజశేఖర్ సేవలు మరువలేనివి

### ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి

### వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ

**తాడేపల్లి, అక్టోబర్ 12, (జయ జయహే):**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు స్వర్గీయ కాకుమాను రాజశేఖర్ వర్ధంతి కార్యక్రమం సోమవారం తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొని రాజశేఖర్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కాకుమాను రాజశేఖర్ ఎన్నో కీలక పదవులు నిర్వహించినప్పటికీ, పదవులపై ఆశ కంటే ప్రజలకు సేవ చేయాలనే తపననే ఎక్కువగా కలిగి ఉండేవారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలో మంచిని చూడటం, కులమతాలు, తారతమ్యాలు లేకుండా అందరినీ ప్రేమించడం ఆయనలోని గొప్ప మానవతా లక్షణాలని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యే వరకు కష్టపడి పనిచేస్తానని రాజశేఖర్ అనేక సందర్భాల్లో చెప్పేవారని గుర్తుచేశారు. ఆయన మరణం కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, ముఖ్యంగా సమాజం మానవతా హృదయం కలిగిన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాజశేఖర్ వంటి నాయకుడు పార్టీలో ఉండటం తమ అదృష్టమని పేర్కొంటూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని జిల్లాల్లో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయడమే స్వర్గీయ రాజశేఖర్‌కు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సలాది కనకారావు అధ్యక్షత



వహించారు. ప్రచార కమిటీ విభాగం జోనల్ ప్రెసిడెంట్ జీవీ రవిరాజు, రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డాది మధుసూదన్ రావు తదితర పార్టీ నాయకులు పాల్గొని కాకుమాను రాజశేఖర్‌కు నివాళులర్పించారు.



# గంటా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

**విశాఖపట్నం, అక్టోబర్ 12: (జయ జయహే)**

జీవీఎంసీ 6 వార్డులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో భీమిలి నియోజకవర్గం 1 వ వార్డు నుంచి, ఆనందపురం మండలం శొంట్యాం గ్రామం నుంచి వరుసగా టీడీపీలో చేరికలు జరగగా, తాజాగా కొమ్మాది, అమరావతి నగర్, ఎన్టీఆర్ కాలనీ, సాయిరాం కాలనీ తదితర ప్రాంతాల నుంచి 100 మందికి పైగా వైసీపీకి గుడ్ బై చెప్పారు. టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ మన్యాల సోంబాబు ఆధ్వర్యంలో వైసీపీ మాజీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, ముఖ్య నాయకులు కనకరాజు, సంజీవ్, మన్యాల హనుమంతు, గణేష్ తదితరులు పార్టీలో చేరారు. పసుపు కండువాలు కప్పి గంటా వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అనేకమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, వార్డు అధ్యక్షుడు గరే గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



# కాకినాడ రూరల్‌లో జనసేనలో చేరిన వైసీపీ నేతలు

### పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్న పలువురు నేతలు

**కాకినాడ, అక్టోబర్ 12 (జయ జయహే):**

జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జనసేనలో చేరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో పవన్ కల్యాణ్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. జనసేనలో చేరిన వారిలో రాష్ట్ర పద్మశాలి నాయకుడు పంపన రామకృష్ణ, కరప మండల మాజీ జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు, తూరంగి గ్రామ మాజీ సర్పంచ్, మత్స్యకార నాయకుడు బలగం ప్రసన్న కుమార్, బలగం హరీష్ కుమార్, కూరాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెలుగుబంట్ల నారయ్య, పద్మశాలి నాయకుడు పంపన వెంకట రమణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు జనసేనలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# బాక్సింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

### చెస్‌లో తృతీయ స్థానం..

### బాక్సింగ్‌లో స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు

**విశాఖపట్నం, అక్టోబర్ 12, (జయ జయహే):**

ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్, బాక్సింగ్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. చెస్ పోటీల్లో తృతీయ స్థానం సాధించగా, బాక్సింగ్‌లో మూడు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాలలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ ఛాంపియన్‌షిప్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అదేవిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషుల బాక్సింగ్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ కళాశాలకు చెందిన ఏ. అశోక్ కుమార్ స్వర్ణ పతకం, ఎన్. జగదీష్ రజత పతకం, జి. కౌశిక్ కుమార్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడం పట్ల కళాశాల కార్యదర్శి డాక్టర్ జి. మధుకుమార్ హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎస్.కె. చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.ఆర్.ఎస్. లక్ష్మణ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని విజేతలను అభినందించారు.

# అధికారుల నిర్లక్ష్యం.. గ్రామస్తుల శ్రమదానం!





## 3.5 కిలోమీటర్ల రహదారికి గ్రామస్తులే మరమ్మతులు

### అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన కరువు

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులే రంగంలోకి దిగారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తూ కాలం గడపకుండా.. పారలు, గునపాలు చేతబట్టి శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేపట్టారు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని బొకోయిగూడ గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు వి. భగవాన్, కే. భవాని రాజు, టి. మురళీధర్, కే. జీనబంధు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో గర్భిణులను, రోగులను డోలీలు, మంచాలపై మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. నిత్యావసర సరుకులు, రేషన్ తెచ్చుకోవడానికి సైతం కాలినడకన మైళ్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. 3.5 కిలోమీటర్ల రహదారికి మరమ్మతులుగ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేకపోవడంతో గ్రామస్తులంతా ఒక్కటై సుమారు 3.5 కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిధులు మంజూరు కాకపోయినా, తమ గ్రామానికి తామే బాట వేసుకోవాలనే సంకల్పంతో శ్రమదానం చేస్తున్నామని పేర్కొన్నారు.

**వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు.. రాకపోకలకు ఇబ్బందులు**

ఆర్లోయిపుట్టు జంక్షన్ నుంచి బొకోయిగూడ గ్రామానికి వెళ్లే మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.గ్రామానికి శాశ్వత పరిష్కారంగా బీటీ రహదారి నిర్మించి, ప్రజల కష్టాలను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల ఐక్యతతో చేపట్టిన శ్రమదానం అందరికీ ఆదర్శంగా నిలుస్తుండగా, ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వి. మహేష్, పి. రాజుతో పాటు గ్రామ మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

### ఏయులో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

### కౌంటింగ్ గదులు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, ఫుడ్ కౌంటర్ల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు.

**విశాఖపట్నం, అక్టోబర్ 12, జయ జయహే**

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని కౌంటింగ్ కేంద్రాలను, అన్ని జోన్ల పరిధిలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పటిష్టంగా సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, అందరు జోనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని న్యూ క్లాస్ రూమ్ బ్లాక్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎకనామిక్స్, ప్రిన్సిపల్ బ్లాక్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ తదితర బ్లాకులను,విభాగాలను కమిషనర్ విస్తృతంగా పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియకు అనువైన గదులను గుర్తించి, తగినంత గాలి, వెలుతురు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కౌంటింగ్ గదులు, రూట్ మ్యాప్‌ల వివరాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని, అదనపు కమిషఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, సామగ్రి పంపిణీ, సిబ్బంది రాకపోకలు సజావుగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దయానిధి, అదనపు కమిషనర్లు కే. రమేష్, డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజినీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, అందరు జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజినీర్లు, డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ ప్లానర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ప్లానింగ్ అధికారులు, అమెనిటీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లూరి జిల్లా ఆదివాసి క్రీడాకారులు ఎంపిక

**అరకులోయ, అక్టోబర్ 12. జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా కు చెందిన ఆదివాసి గిరిజన క్రీడాకారులు రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథలిటిక్స్ పోటీల్లో సత్తా సాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 10, 11 తేదీలలో నిర్వహించిన 45వ ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్ పోటీలలో వివిధ విభాగాలలో పథకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 2027 జనవరి లో ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో జరుగుతున్న జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. పథకాలు సాధించిన క్రీడాకారుల వివరాలు బురిడీ జానీ బాబు 10 కిలోమీటర్ పరుగు పందెంలో కాంస్యం పథకం, 5 కిలోమీటర్ లో సిల్వర్, 1500ల మీటర్స్ లో కాంస్యం పథకం.కిల్లో బుద్దు 10 కిలోమీటర్ లో ప్రథమ స్థానం, 5 కిలోమీటర్ లో ప్రథమ స్థానం, 800ల మీటర్ లో ద్వితీయ స్థానం.పాంగి మోహన్ రావు 10 కిలోమీటర్ లో ద్వితీయ స్థానం, 800 మీటర్స్ ప్రథమ స్థానం, 1500 మీటర్స్ ద్వితీయ స్థానం.పెట్టేలి క్రిష్ణ 800 మీటర్స్ లో కాంస్యం పథకం. కుర్తడి ప్రసాద్ 400 మీటర్స్ లో ద్వితీయ స్థానం. వంతల చంటీ బాబు హేమర్త్రోలో ప్రథమ స్థానం. 4ఐ400 మీటర్స్ రిలే లో ప్రథమ స్థానం సాధించిన బురిడీ జానీ బాబు, కిల్లో బుద్ధు, పాంగి మోహన్ రావు, కోటేశ్వరరావు 30ంనుంచి 45 సంవత్సర విభాగంలో ప్రథమ స్థానం. విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. విజేతాలు 2027 జనవరి నెలలో లక్నోలో జరగబోయే జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.



## అప్పుఘర్లో రోటరీ వైద్య శిబిరం

**విశాఖపట్నం, అక్టోబర్ 12, జయ జయహే :**

రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో అప్పు ఘర్ పాఠశాలలో జరిగిన మెగా వైద్య శిబిరం విజయవంతమైనది. సుమారు 300 మందికి ఈ శిబిరంలో వివిధ వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయ బృందానికి వైద్య శిబిరంలో వైద్య పరీక్ష నిర్వహించారు. వి హెల్త్ కేర్, వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో కంటి, దంత, ఊపిరితిత్తుల పరీక్షలతో పాటు బీపీ, షుగర్, చర్మ వ్యాధులు సంబంధించి వైద్య నిపుణులు, మహిళల ఆరోగ్య సమస్యల కు సంబంధించి స్త్రీ వైద్యనిపుణులు పాల్గొని విశేష సేవలు అందజేశార. డాక్టర్ కరణ్, డాక్టర్ జీవిత, డాక్టర్ వసుధ, డాక్టర్ జయంతి, వి హెల్త్ కేర్ చీఫ్ మేనేజర్ సిహెచ్.కృష్ణ, కార్పొరేట్ మేనేజర్ కె. పృథ్వీరాజ్ వైద్య శిబిరంలో సేవలందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షులు సిహెచ్. కామేశ్వరరావు, కార్యదర్శి కె.ఎం.కె. రమేష్, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుమ్ములూరి లక్ష్మి, రోటరీ క్లబ్ ప్రతినిధులు బి. బ్రహ్మానందం, బి. శంకర్రావు, టి. సురేష్, ప్రభు జనార్దన్, టీ. కోటేశ్వరరావు, బి. భాస్కర్, జీ.కే. మూర్తి, జి. వెంకట్రామ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేటర్ రేసులో రాచకొండ లక్ష్మయ్య

### 68వ వార్డు సీటు కోసం యత్నం

### 30 ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్నా..

### కార్పొరేటర్ టికెట్ అడిగే అర్హత నాకు లేదా?

### పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తకు అవకాశం కల్పించాలి

**గుంటూరు, అక్టోబర్ 12, జయ జయహే**

తెలుగుదేశం పార్టీ కోసం 1994 నుంచి నిరంతరం పనిచేస్తూ, సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి గుంటూరు పార్లమెంట్ స్థాయి వరకు ఎదిగానని, ప్రస్తుతం గుంటూరు నగరంలోని 68వ డివిజన్ కార్పొరేటర్ టికెట్‌ను ఆశిస్తున్నట్లు టీడీపీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వెన్నంటి నిలిచి పనిచేశానని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికలో బూత్ ఏజెంట్‌గా బాధ్యతలు నిర్వహించానని, 2024 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలోని 51వ డివిజన్‌లో పార్టీ కోసం పనిచేశానని వెల్లడించారు. సామాజిక మాధ్యమాలు, ఇతర మాధ్యమాల ద్వారా గత ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ పార్టీ తరఫున తన గళాన్ని వినిపించానని తెలిపారు.

గత 30 సంవత్సరాలుగా మల్లికార్జునపేట, శ్రీనగర్ ప్రాంతాలతో తనకు అనుబంధం ఉందని, స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నానని చెప్పారు. ఇన్నేళ్లుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తాను కార్పొరేటర్ టికెట్ ఆశించడంలో తప్పేముందని ప్రశ్నించారు.

**పదవి కోసం కాదు.. ప్రజలకు సేవ చేసే అవకాశం కోసమే!**

పదవుల కోసం కాకుండా పార్టీ అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని రాచకొండ లక్ష్మయ్య పేర్కొన్నారు. తన సుదీర్ఘ రాజకీయ సేవలను గుర్తించి, సామాన్య కార్యకర్తగా తనకు కూడా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నజీర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "పార్టీ కోసం మూడు దశాబ్దాలుగా పనిచేసిన కార్యకర్తగా 68వ డివిజన్ కార్పొరేటర్ టికెట్ ఆశిస్తున్నాను. నా సేవలను గుర్తించి అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నాను" అని రాచకొండ లక్ష్మయ్య పేర్కొన్నారు.



## వైజాగ్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

### 29వ సారి రక్తదానం చేసిన సామాజిక కార్యకర్త శ్రీ సాయిరామ్

**విశాఖపట్నం, అక్టోబర్ 12, (జయ జయహే):**

దివంగత వైజాగ్ వాలంటీర్స్ బోర్డు సభ్యుడు సురేష్ గతిరెడ్డి జ్ఞాపకార్థం విశాఖపట్నంలోని రామ్‌నగర్ లైన్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైజాగ్ వాలంటీర్స్, లైన్స్ క్లబ్ విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో ప్రముఖ సామాజిక కార్యకర్త, రక్తదాన ప్రేరేపకుడు పి. శ్రీ సాయిరామ్ పాల్గొని 29వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. రక్తదానం అత్యంత గొప్ప సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.సమాజ సేవలో నిరంతరం ముందుంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వైజాగ్ వాలంటీర్స్ అధ్యక్షుడు సతీష్‌తో పాటు సంస్థ ప్రతినిధులు, లైన్స్ క్లబ్ సభ్యులను సాయిరామ్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వైజాగ్ వాలంటీర్స్ సభ్యులు, రక్తదాతలు, లైన్స్ క్లబ్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సిహెచ్ డబ్ల్యులకు ఆశా వర్కర్లతో సమానంగా రూ.10,000 గౌరవ వేతనం చెల్లించాలి

**అరకులోయ: అక్టోబర్ 12. జయ జయహే.**

డుంబ్రిగూడ: ఆశా వర్కర్లకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లిస్తూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సిహెచ్ డబ్ల్యు కేవలం రూ.4,000 మాత్రమే చెల్లించడం శ్రమ దోపిడీకి నిదర్శనమని సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ అన్నారు. ఒకే విధమైన ఉద్యోగ బాధ్యతలు, సమానమైన పని భారం ఉన్నప్పుడు గౌరవ వేతనాల్లో ఇంత వ్యత్యాసం ఎందుకని ఆమె ప్రశ్నించారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ఆర్గనైజేషన్ సిహెచ్ డబ్ల్యూ ఓ ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న సిహెచ్ డబ్ల్యూ లకు సుజాత సల్మాన్ సంఘీభావం ప్రకటించారు. వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిహెచ్ డబ్ల్యు లకు ఆశా వర్కర్లతో సమానంగా నెలకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని, సి హెచ్ డబ్ల్యు ల సమస్యలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సి హెచ్ డబ్ల్యు ల శ్రమకు తగిన గుర్తింపు, సమాన పనికి




సమాన గౌరవ వేతనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని సుజాత సల్మాన్ పేర్కొన్నారు. అధికారులు స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని ఆమె కోరారు.





## నల్ల మిరియాలతో ఈ సమస్యలన్నీ దూరం

**నల్ల మిరియాలు.. చూడ్డానికి చిన్నగా ఉండే ఈ మిరియాల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.**

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎన్నో ఆరోగ్య సమస్యలొస్తాయి. వీటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే డైట్‌లో కొన్ని యాడ్ చేసుకోవాలి. వీటి వల్ల ఈ సీజన్‌లో వచ్చే సీజనల్ సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అందులో భాగంగా మిరియాలని యాడ్ చేసుకోవడం వల్ల ఏ లాభాలున్నాయో తెలుసుకోండి.

### జీర్ణక్రియ..
వర్షాకాలంలో అజీర్ణం, ఉబ్బరం, కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలు సర్వసాధారణం. నల్ల మిరియాలు కడుపులో హైడ్రోకోరిక్ యాసిడ్ స్రావాన్ని పెంచి జీర్ణక్రియని ప్రోత్సహిస్తుంది. ఇది ఆహారాన్ని విచ్చిన్నం చేసి పోషకాల శోషణని పెంచుతుంది. అదనంగా, నల్ల మిరియాలు కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి ఆపానవాయువుని తగ్గిస్తుంది. ప్రేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

### ఇన్ఫెక్షన్స్ నుండి రక్షణగా..
వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా ఇన్ఫెక్షన్స్ సోకుతాయి. నల్ల మిరియాలు తీసుకుంటే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు కలిగి ఉంటాయి. ఇవి వివిధ వ్యాధికారక కారకాల పెరుగుదలని నిరోధించగలవు. ఇది సహజ యాంటీ బయాటిక్‌గా పనిచేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలని నివారిస్తుంది. ఇన్ఫెక్షన్స్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నల్ల మిరియాల కారణంగా సూక్ష్మజీవుల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

### పోషకాల శోషణని..
మనం శరీరంలో పోషకాల జీవ లభ్యతని పెంపొందించడంలో నల్ల మిరియాలు కీ రోల్ పోషిస్తుంది. ఇది పైపెరిన్ అనే సమ్మేళనాలని కలిగి ఉంటుంది. ఇది విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి వివిధ పోషకాల శోషణని మెరుగుపరుస్తుంది. మీ భోజనంలో నల్ల మిరియాలని యాడ్ చేయడం వల్ల మన ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను సమర్థవంతంగా గ్రహించేలా చేస్తుంది.

### జలుబు, జ్వరం..
వర్షాకాలం వచ్చిందంటే చాలా మందికి జలుబు, జ్వరంతో బాధపడతారు. మిరియాలు తీసుకుంటే వీటన్నింటి నుంచి రిలీఫ్ ఉంటుంది. నల్ల మిరియాలను డైట్‌లో చేయడం, గోరువెచ్చని నీటిలో మిరియాల పొడి కలిపి తీసుకుంటే వీటి వల్ల రిలాక్సేషన్ ఉంటుంది.

### ఇమ్యూనిటీ..
బ్లాక్ పెప్పర్‌లో రిచ్ యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సిలు ఉంటాయి. ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తాయి. వర్షాకాలంలో వీటిని తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి. ఇది ఇమ్యూనిటిని బలంగా చేసి భయంకర ఆరోగ్య సమస్యల కారణంగా మనం బాధపడకుండా మనల్ని బలంగా చేస్తాయి.

### కీళ్ళ నొప్పులు..
వర్షాకాలంలో కీళ్ళనొప్పులు, వాపులు వంటి వాపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. నల్ల మిరియాలని తీసుకుంటే శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఇందులో పైపెరిన్ మంటను తగ్గించి, నొప్పిని తగ్గిస్తుంది. మీ ఆహారంలో నల్ల మిరియాలని చేర్చితే మంటని ఎదర్కోవడంలో, కీళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# గుండె, కిడ్నీలపై ఎఫెక్ట్ చూపే హైబీపీ
## తగ్గేందుకు ఇలా చేయాల్సిందే



**గుండె సమస్యలు రావడానికి కారణాల్లో హైపర్ టెన్షన్ కూడా ఒకటి. అధిక రక్తపోటు కారణంగా గుండెపై ఎలాంటి ప్రభావం పడుతుంది. దీని వల్ల ఏయే సమస్యలొస్తాయి. వాటి నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో తెలుసుకోండి.**

### హైపర్ టెన్షన్ అంటే..
శరీరంలోని రక్తం స్పీడ్‌గా ధమనుల గోడలవైపు వెళ్తే హైపర్ టెన్షన్ అంటారు. హైపర్ టెన్షన్ అనేది రక్తనాళాల్లో ఒత్తిడిని పెంచుతుంది. ఇది 140/90mmHg లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుంది. బీపి రీడింగ్ 140 దాటినప్పుడు అది హైబీపి అని చెప్పొచ్చు. దీనికి వయసు, తీసుకునే ఫుడ్, ఆల్కహాల్ తీసుకోవడం, పొగాకు వాడకం వంటి కారణాలు ఉంటాయి.

### రక్తపోటు తగ్గాలంటే ఎలా ఫుడ్ తీసుకోవాలి
హైపర్ టెన్షన్ అనేది కేవలం గుండె సమస్యేనా..
గుండె జబ్బులు రావడానికి కారణాల్లో హైపర్ టెన్షన్ ఓ కారణం. అదే విధంగా, కేవలం గుండెకే ప్రమాదం కాదు. కిడ్నీలు కూడా ఎపెక్ట్ అవుతాయి. దీనికి కారణాలు ఏంటంటే..

బాడీలోని లిక్విడ్స్, ఎలక్ట్రోలైట్స్‌ని బ్యాలెన్స్ చేయడం ద్వారా బీపిని కంట్రోల్ చేయడంలో కిడ్నీలు కీ రోల్ పోషిస్తాయి.
కిడ్నీలు సరిగా పరిచేయకపోతే హైబీపి పెరుగుతుంది.
మూత్రపిండాలకి రక్తాన్ని సరఫరా చేసే ధమనులు ఇరుగ్గా మారిని హైబీపి వస్తుంది.
కిడ్నీల సమస్యలకి హైబీపి కారణమవుతుంది.
దెబ్బతిన్న కిడ్నీలు రక్తాన్ని సరిగ్గా ఫిల్టర్ చేయలేవు. దీని వల్ల ద్రవం నిలుపుదల, రక్తపోటు పెరుగుతుంది.
హైపర్ టెన్షన్ కారణంగా కిడ్నీలపై ఎఫెక్ట్ అయితే ఈ లక్షణాలు ఉంటాయి..
కాళ్ళు, చీలమండలు, పాదాల్లో వాపు ఉంటుంది.
మూత్రపిండాల సమస్యల కారణంగా ద్రవాలు నిలుస్తాయి.



మూత్రంలో నురగ వస్తుంది.
రాత్రుళ్ళు ఎక్కువగా మూత్రం వస్తుంటుంది.
మూత్రం ఎర్రని రంగులో వస్తుంటుంది.
అలసట, బలహీనంగా ఉంటాయి.
సమస్య తగ్గేందుకు..
సమస్య తగ్గేందుకు..

### గుండె, కిడ్నీలని కాపాడుకునేందుకు ఏం చేయాలంటే..
రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. బీపిని చెక్‌చేస్తుండాలి.
కిడ్నీలు వ్యర్థాలను ఫిల్టర్ చేసేందుకు పుష్కలంగా నీరు తాగాలి.
బ్యాలెన్స్‌డ్ డైట్.. తక్కువగ సోడియం తీసుకోవాలి, పండ్లు కూరగాయలు, హెూల్ గ్రెయిన్స్ ఎక్కువగా తీసుకోవాలి.
రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి. హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి.
ఆల్కహాల్, స్మోకింగ్‌ని తగ్గించాలి. ఈ రెండూ కూడా బీపి, కిడ్నీ సమస్యల్ని పెంచుతాయి.

### హైబీపి ఉంటే ఏం చేయాలి?
ముందుగా సమస్య ఉందని గమనించినప్పుడు నెఫ్రాలజిస్ట్‌ని కలవండి.
ట్రీట్‌మెంట్ తీసుకుంటూ హెల్దీ డైట్, లైఫ్‌స్టైల్ చేంజెస్ చేయండి.
బీపిని చెక్ చేసుకోవాలి.
ఏ సమస్య ఉన్నా డాక్టర్‌కి తెలియజేయాలి.
సమస్యని తగ్గించుకునేందుకు డాక్టర్ ఇచ్చే సలహాలు తప్పకుండా పాటించాలి.
హైపర్ టెన్షన్ అనేది గుండె సమస్యలకంటే ప్రమాదకరం. దీని వల్ల కిడ్నీలు కూడా ఎఫెక్ట్ అవుతాయి. కాబట్టి, సమస్యని తగ్గించుకునేందుకు హెల్దీ డైట్ ఫాలో అవుతుంది. మంచి లైఫ్‌స్టైల్‌ని మెంటెయిన్ చేయాలి. కిడ్నీలను కూడా కాపాడుకునే ప్రయత్నం చేయండి.

# బరువు తగ్గాలంటే ఈ డైట్ ఫాలో అవ్వండి




ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్.. ఈ మధ్యకాలంలో బరువు తగ్గడానికి ఫుల్ పాపులర్ అయిన డైట్. దీనిని ఫాలో అవ్వడం వల్ల చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. అలానే నెగెటీవ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ విషయానికొస్తే ఏమి తినాలనే విషయంపై ఎలాంటి పరిమితులు తినాలి.. కానీ, ఎలా తినాలి, ఏ టైమ్‌లో తినాలనేదే ముఖ్యం. ఎక్కువగా షుగర్, ఉప్పు, ఫ్యాట్ ఫుడ్స్ తగ్గించాలి. పోషకాహారం తీసుకోవాలి.

### ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్..
ఈ ఫాస్టింగ్ టైమ్‌లో మీరు కడుపు నిండే వరకూ తినొచ్చు. అదే విధంగా, ఈ ఆహారాన్ని తినే టైమింగ్స్ డిఫరెంట్‌గా ఉంటాయి. సాధారణంగా, 3 టైమింగ్స్ ఉంటాయి. అవేంటంటే..

### ప్రీ డయాబెటిక్ ఎందుకొస్తుంది..
ఫాస్టింగ్ టైమింగ్స్.. 16/8 టైమింగ్.. రోజులోని 24 గంటల్లో మీకు వీలైన ఏవైనా 8 గంటలను సెలక్ట్ చేసుకోవాలి. ఆ ఎనిమిది గంటల్లో మీరు మీ రోజువారీ కేలరీల అవసరాల్లో మధ్యస్థంగా తినొచ్చు.

### టైమింగ్స్..
ఆ ఎనిమిది గంటలు ఉదయం 7 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ, ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకూ, రాత్రి 8 నుండి తెల్లవారుజామున 2 గంటల వరకూ ఇలా ఎప్పుడైనా మీకు వీలైనట్లుగా ఫాలో అవ్వొచ్చు.
5 : 2 సార్లు వారానికి ఐదురోజులు మీరు ఈ ఫాస్టింగ్ ఫాలో అవ్వొచ్చు. కానీ, 500 నుంచి 600 కేలరీలు మాత్రమే రెండు రోజులు మాత్రమే తీసుకోవాలి.
ఈట్ స్టాప్ ఈట్ మెథడ్ .. వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఏం తినొద్దు. వీలైతే 24 గంటలు ఫాస్టింగ్ ఉండాలి.

### గుండె ఆరోగ్యం..
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ స్తాయిలు, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు తగ్గి గుండె జబ్బులు కూడా తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

### టైప్ 2 డయాబెటిస్..
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో టైప్ 2 డయాబెటిస్ తగ్గుతుంది.
దీని వల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది బ్రెయిన్ హెల్దీగా మారి శరీరానికి, మనస్సుకి తగిన విశ్రాంతి దొరుకుతుంది. మానసిక ఆరోగ్యాన్ని, బ్రెయిన్ హెల్త్‌ని కాపాడుతుంది.
ఈ ఫాస్టింగ్ ఫాలో అయ్యే వరకూ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### బరువు తగ్గడం..
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ఫాలో అయ్యేటప్పుడు ఇది హార్డ్ కార్బోహైడ్రేట్స్‌ని విచ్ఛిన్నం చేస్తుంది. వాటిని గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం శక్తి కోసం ఉపయోగిస్తుంది. కాబట్టి, తక్కువ కేలరీలు తీసుకుంటే చాలు. కేలరీలు తగ్గినప్పుడు, శరీరంలోని గ్లూకోజ్ శక్తిగా మారుతుంది. దీని వల్ల శరీరంలోని అనవసర కొవ్వులు కరిగి బరువు తగ్గుతారు.

### నెగెటీవ్ ఎఫెక్ట్స్..
ఈ డైట్ ఫాలో అయినప్పుడు మొదలుపెట్టినప్పుడు కొన్ని సమస్యలు ఉంటాయి. అవి..
ఆకలి
ఎక్కువగా తినాలనిపించడం
తలనొప్పిజి
అజీర్ణం
మూడ్ స్వింగ్స్
శక్తి తగ్గడం
అలసట
నోటి దుర్వాసన
నిద్ర సమస్యలు
డీహైడ్రేషన్‌జి
పోషకాహార లోపాలు

Jayahe CINEMA

# సినిమా న్యూస్



## పెళ్లిపై రూమర్స్ స్పందించిన మమిత

సినిమాల్లో తన అల్లరితో ఆకట్టుకునే నటి మమితా బైజు నిజ జీవితంలోనూ తనపై వచ్చిన ఓ రూమర్‌పై అంతే ఫన్నీగా స్పందించారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ అమ్మడికి సంబంధించిన ఓ వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. మమితా బైజు జీవితంలోని ప్రతి నిర్ణయాన్ని, ముఖ్యంగా ఆమె ఎవరిని పెళ్లి చేసుకోవాలనే దానిని కూడా ఆమె సోదరుడు మిథున్ బైజునే నిర్ణయిస్తారంటూ వరుసగా పోస్ట్‌లు కనిపిస్తున్నాయి. దీనిపై మమితా ఫన్నీగా స్పందించారు. ఇదే విషయాన్ని ఓ ఎంటర్‌టైనర్ పేజ్ పోస్ట్ చేయగా.. దానికి 'వాట్' అనే స్టికర్‌ను రిప్లైగా పెట్టారు. ఇక

సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే హ్యాట్రిక్ హిట్ అందుకున్న మమితా ప్రస్తుతం తమిళ రొమాంటిక్ డ్రామా 'ఇరండు వానం'లో నటిస్తున్నారు. రామ్ డి. దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విష్ణు విశాల్ హీరోగా నటిస్తున్నారు. దీనితో పాటు భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'జై హనుమాన్'లోనూ ఆమెకు అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం చిత్రబృందం మమితా బైజును రంగంలోకి దించినట్లు సమాచారం. ఇప్పటికే ఆమె ఈ చిత్ర సెట్‌లోకి అడుగు పెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## చిన్నపిల్లల కోసమే నా కొత్త యూట్యూబ్ ఛానల్: సల్మాన్

బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ తన కొత్త యూట్యూబ్ ఛానల్ 'బీయింగ్ సల్మాన్ ఖాన్'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఛానల్‌లోని వీడియోలు పెద్దల కోసం కాదని, కేవలం చిన్నపిల్లల కోసమేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ''నా యూట్యూబ్ ఛానల్ చూస్తున్నందుకు ధన్యవాదాలు. అందులోని కంటెంట్ మీకు అంతగా నచ్చకపోవచ్చు. ఎందుకంటే.. అది మీ కోసం కాదు, మీ ఇంట్లోని చిన్నపిల్లల కోసం మాత్రమే. వినోదం, ప్రేమ, కుటుంబ బంధాలతో పాటు పిల్లలకు విద్య కూడా ఎంతో అవసరం కదా'' అని సల్మాన్ రాసుకొచ్చారు. మిగతా సెలబ్రిటీల ఛానల్స్ తరహాలో ఈ ఛానల్‌లో వ్యక్తిగత విషయాలు, షూటింగ్ విశేషాలు ఉండవు.





## హీరోయిన్‌గా టాలీవుడ్ హీరో కుమార్తె

టాలీవుడ్ హీరో శ్రీకాంత్ కుమార్తె మేధ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఓ క్యూట్ లవ్‌స్టోరీతో ఇండస్ట్రీని పలకరించనున్నారు. ఈ మేరకు తాజాగా సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. 'మైత్రీ ఇన్ లవ్' పేరుతో ఈ సినిమా రానుంది. జై జాస్తి, మేధ హీరో హీరోయిన్‌లుగా పరిచయమవుతోన్న ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీస్ మేకర్స్ నిర్మిస్తోంది. 'వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థా నాన్ని సంపాదించుకునేప్రేమకథ ఇది' అనే క్యాప్షన్‌తో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే పంచుకోనున్నట్లు తెలిపింది. హీరోయిన్‌గా మేధ టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే, ఆమె వెండితెరకు కొత్తేం కాదు. అనుష్క ప్రధానపాత్రలో వచ్చిన 'రుద్రమదేవి' చిత్రంలో మేధ చిన్నప్పటి రుద్రమదేవి పాత్రలో కనిపించి మెప్పించారు. ఇక, ఇప్పటికే శ్రీకాంత్ తనయుడు రోషన్ నటుడిగా అలరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శైలేష్ కొలను దర్శకత్వంలో 'ఏమో ఏమో ఇది' అనే రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు.

## ఉత్తమ నటుడిగా జేడీ చక్రవర్తి



ప్రఖ్యాత నార్వే ఇంటర్నేషనల్ చిత్రోత్సవాల్లో తెలుగు నటుడు జేడీ చక్రవర్తి ఉత్తమ నటుడిగా పురస్కారం గెలుచుకున్నారు. 'దహిణి: ది విచ్' చిత్రంలో నటనకుగానూ ఆయనకు ఈ పురస్కారం లభించింది. హిందీ, ఒడియా భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి ఉత్తమ చిత్రంగా పురస్కారం లభించింది. రాజేశ్ టచ్‌రివర్ దర్శకత్వంలో... సునీతాకృష్ణన్, ప్రదీప్ నారాయణన్ నిర్మాతలుగా రూపొందించిన చిత్రమిది. తనిష్ట ఛటర్జీ, జేడీ చక్రవర్తి, శ్రుతిజయన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ఈ సినిమా పురస్కారాల్ని గెలిచింది.

## నవంబరు 5న థియేటర్ల లోకి 'రామాయణ'

సినీప్రియులందరి దృష్టి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్న 'రామాయణ' చిత్రం మీదే. నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో రాముని పాత్రలో బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి కనిపించనున్నారు. రావణుడిగా హీరో యశ్ నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్, పోస్టర్లు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకున్నాయి. దీన్ని దీపావళి సందర్భంగా విడుదల చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించినా.. తేదీని ఇంకా ఖరారు చేయలేదనే



విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నవరాత్రి సందర్భంగా తాజాగా ఈ సినిమాని నవంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది చిత్రబృందం. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా మరో కొత్త పోస్టర్‌ను పంచుకుంది.



## గ్రామీ అవార్డుల బరిలో ధురంధర్ సౌండ్ ట్రాక్

బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన బ్లాక్‌బస్టర్ యాక్షన్ చిత్రం 'ధురంధర్: ది రివెంజ్'. బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన ఈ సినిమా ఆల్బమ్ ఇప్పుడు 2027 గ్రామీ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తం 8 విభాగాల్లో అవార్డుల పరిశీలనకు పంపినట్లు నిర్మాణ సంస్థ 'బీ62 స్టూడియోస్' అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. విజువల్ మీడియాకు సంబంధించి ఉత్తమ సౌండ్‌ట్రాక్‌గా 'ధురంధర్' ఆల్బమ్‌ని పోటీకి పంపారు. అలాగే పలు పాటలను వేర్వేరు విభాగాల్లో గ్రామీ పరిశీలనకు పంపించారు.

## గ్యాంగ్‌స్ట ర్ పాత్రలో నాని బ్లడీ రోమియో



ఇటీవల 'ది ప్యారడైజ్'తో ప్రేక్షకులను పలకరించారు నాని. ఇప్పుడాయన తన కొత్త సినిమా కోసం సిద్ధమవుతున్నారు. సుజీత్ దర్శకత్వంలో నాని నటించబోయే మూవీ 'బ్ల డీ రోమియో. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించి నాని పాత్ర లుక్ టెస్ట్ చేశారు. దసరా కానుకగా ఈ లుక్‌ను విడుదల చేయాలని చిత్ర బృంద భావిస్తోంది. పండగ తర్వాత సెట్స్‌పైకి వెళ్ల నున్న ఈమూవీని వచ్చే ఏడాది ప్రారంభం నాటికి పూర్తి చేసి... వేసవికి థియేటర్ల లోకి తీసుకురావాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ థ్రిల్ల ర్గా ముస్తా బు కానున్న ఈ సినిమాలో నాని గ్యాంగ్‌స్టర్ పాత్రలో అలరించనున్నారు.



## ట్రోల్స్‌ని సీరియస్‌గా తీసుకోకపోవడమే మంచిది

ప్రపంచం మనల్ని ప్రశంసించే సందర్భాలు ఉంటాయి. అలాగే ఒక్కోసారి మనల్ని మనం ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాల్సిన పరిస్థితులూ ఎదురవుతాయని అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కత్రినా కైఫ్. ఇటీవలే ఓ వేడుకలో పాల్గొన్న ఆమెపై.. ప్రసవానంతరం చాలా బరువు పెరిగారంటూ కొందరు ట్రోల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వీటిపై పరోక్షంగా స్పందిస్తూ.. కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు కత్రినా. ''సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు... మన ఆత్మ గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేయకుండా జాగ్రత్తపడాలి. అక్కడ ఎన్నో రకాల అభిప్రాయాలు ఉంటాయి. వాటిన్నింటికీ అనుగుణంగా నడుచుకోవాలని ప్రయత్నిస్తే.. మనం ఏ విషయంలోనూ సరైన నిర్ణయాలు తీసుకోలేం. విమర్శలు ఎదురైన ప్రతిసారీ వాటికి భయపడితే జీవితంలో ముందుకు సాగలేకపోయేదాన్నేమో. అందుకే ఇక్కడ ఎవరికి వారే చీర్ లీడర్‌గా ఉండాలి. జీవితంలోని పలు దశలలో మనల్ని మనం అంగీకరించుకోవాల్సిన అవసరం ఉంటుంది. కాబట్టి విమర్శలు, ట్రోల్స్‌ని తేలికగా తీసుకోవడం.. మిమ్మల్ని మీరు మరీ సీరియస్‌గా తీసుకోకపోవడం మంచిదని నా అభిప్రాయం'' అని చెప్పారు కత్రినా.



## '96'లో జాను పాత్ర కు తొలి ఛాయిస్ ఆమే..

**కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి, నటి త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన బ్లాక్‌బస్టర్ రొమాంటిక్ డ్రామా '96'. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ తమిళనాడులో అక్టోబర్ 9న రీ-రిలీజ్ అయ్యి థియేటర్లలో సందడి చేస్తోంది. అయితే, ఈ సినిమాలో 'జాను' పాత్రకు ముందుగా నటి జ్యోతికను సంప్రదించారంటూ గతంలో వార్తలు వచ్చాయి. తాజాగా దర్శకుడు ప్రేమ్ కుమార్ ఈ వదంతులను కొట్టిపారేశారు.**

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. అది అవాస్తవమన్నారు. ''జాను పాత్రకు నా ఫస్ట్ ఛాయిస్ త్రిషే. అయితే, అప్పట్లో ఆమె వరుస సినిమాలతో బిజీగా ఉండడం వల్ల డేట్స్ కుదరలేదు. వేరే హీరోయిన్‌ను తీసుకోవాలని ఒత్తిడి పెరిగింది. కానీ, చివరకు త్రిష తన షెడ్యూల్ మార్చుకోవడంతో అంతా కుదిరింది. సినిమాలోని పాత్రలను ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు చూపించాలి. అందుకే నేను కొందరు నటీనటులను మనసులో పెట్టుకుని కథలు రాస్తుంటా. ఈ స్క్రిప్ట్ రాసేటప్పుడే నేను విజయ్, త్రిషని ఇందులో నటీనటులుగా ఊహించుకున్నా. అలాగే ఇటీవల 'మెయ్యళగన్' (తెలుగులో 'సత్యం సుందరం') కథ రాస్తున్నప్పుడు నా మైండ్‌లో రజనీకాంత్, కమల్ హాసన్ ఉన్నారు'' అని ఆయన వెల్లడించారు.

ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ''సినిమా విడుదలై ఎన్నేళ్లు గడిచినా, ప్రతి వార్షికోత్సవానికి పోస్టర్ పెడితే విశేష స్పందన వస్తుంది. 2015 డిసెంబరులో చెన్నైలో భారీ వరదలు వచ్చినప్పుడు ఈ కథ రాశాను. కథలే నన్ను ఎంచుకుంటాయని బలంగా నమ్ముతా. ఒక్కోసారి కథ పుట్టినా అది పట్టాలెక్కడానికి సమయం పడుతుంది. 2002లో వచ్చిన ఒక ఐడియాతో ఇటీవల ఓ స్క్రిప్ట్ పూర్తి చేశాను. త్వరలోనే ఆ సినిమా షూటింగ్ మొదలుపెడతాను'' అని ప్రేమ్ కుమార్ తెలిపారు. ఇక '96' చిత్రాన్ని తెలుగులో 'జాను' పేరుతో తెరకెక్కించిన విషయం తెలిసిందే.

## చనిపోయినా వదలట్లేదు..



బాలీవుడ్‌సీనియర్ నటుడు నానా పటేకర్ మరణం తర్వాత నటి తనూశ్రీ దత్తా చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. నానా పటేకర్‌ను ఉద్దేశించి ఆమె 'ఈవిల్ డెడ్' అంటూ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చినా తనూశ్రీ వెనక్కి తగ్గలేదు. తన వ్యాఖ్యలను సమర్థి ంచుకుంది. ఇంతకీ వీరిద్దరి మధ్య వివాదం ఎక్కడ మొదలైంది? 2008లో జరిగిన ఓ సినిమా షూటింగ్ సమయంలో అసలేం జరిగింది?2004లో ఫెమినా మిస్ ఇండియా యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తనూశ్రీ దత్తా.. అదే ఏడాది మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత 2005లో 'ఆషిక్ బనాయా ఆప్నే' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. చాక్లెట్, భాగమ్ భాగ్, ఢోల్, గుడ్ బాయ్ బ్యాడ్ బాయ్ వంటి సినిమాల్లో నటించింది.నానా పటేకర్ తనూశ్రీ దత్తా 2008లో వచ్చిన 'హార్న్ ఓకే ప్లీ జ్ సినిమాలో కలిసి పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరి మధ్య వివాదం మొదలైంది.ఆ సినిమాలో ఓ ప్రత్యేక పాట చిత్రీకరణ సందర్భంగా నానా పటేకర్ తనతో అనుచితంగా ప్రవర్తించారని తనూశ్రీ ఆరోపించింది. ఆ సమయంలో ఆయన ప్రవర్తన తనను ఇబ్బందికి గురిచేసిందని తెలిపింది. ఆ ఘటన గురించి 2018లో మరోసారి బహిరంగంగా మాట్లా డటంతో ఈ వివాదం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది.2018 సెప్టెంబరులో తనూశ్రీ చేసిన ఆరోపణలు అప్పట్లో 'మీటూ' ఉద్యమంలో కీలకంగా మారాయి. పాట చిత్రీకరణలో తనతో పాటు మరో నటుడు మాత్రమే ఉండాల్సి ఉండగా.. నానా పటేకర్ కూడా సన్నిహితంగా ఉండే నృత్య కదలికల్లో పాల్గొనాలని కోరుకున్నారని ఆమె ఆరోపించింది. దీనిపై తాను అభ్యంతరం తెలిపినట్లు చెప్పింది. అయితే తనూశ్రీ ఆరోపణలను నానా పటేకర్ ఖండించారు. అవి అసత్యమని పేర్కొన్నారు.

